**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 69, పేజీలు - 08

శనివారం, సెప్టెంబర్ 5, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతారు!

**- కేటీఆర్ ప్రకటన వెనుక ఆత్మవిశ్వాసమా.?- కాంగ్రెస్‌కు దొరికిన పొలిటికల్ అస్త్రామా.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ గైర్హాజరు వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న ప్రతిసారీ కేసీఆర్ రాకపై ఉత్కంఠ నెలకొనడం, చివరకు ఆయన రాకపోవడం కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీస్తూనే ఉంది. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఈ వివాదాన్ని సరికొత్త మలుపు తిప్పాయి. కేసీఆర్ మళ్లీ అసెంబ్లీకి వస్తే ముఖ్యమంత్రిగానే అడుగుపెడతారు అంటూ కేటీఆర్ చేసిన కుండబద్దలు కొట్టిన ప్రకటన రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. 2023 ఎన్నికల ఓటమి తర్వాత కేసీఆర్ అసెంబ్లీకి కేవలం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసేందుకు, అడపాదడపా గవర్నర్ ప్రసంగం సమయంలో కొద్ది నిమిషాలు మాత్రమే వచ్చి వెళ్లిపోతున్నారు. అసలు సభకు రాబోరని కేటీఆర్ స్వయంగా స్పష్టం చేయడం ఒకరకంగా కాంగ్రెస్ విమర్శలను ధ్రువీకరించినట్లే అయ్యిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**- అసెంబ్లీకి రాకపోవడాల వెనుక బలమైన రాజకీయ కారణాలు**



సాధారణంగా భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో లేదా తెలుగు నేల రాజకీయ చరిత్రలో ప్రతిపక్ష నాయకులు ఇలాంటి ప్రతిజ్ఞలు చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఎన్టీఆర్ మొదలుకుని చంద్రబాబు నాయుడు, జయలలిత వరకు పలువురు నేతలు అధికార పక్షం నుంచి ఎదురైన తీవ్రమైన అవమానాలు, దాడులు లేదా వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిన ఉదంతాలతో తీవ్ర భావోద్వేగంతో సీఎంగానే తిరిగి ఈ సభలో అడుగుపెడతాను అంటూ సవాల్ విసిరారు.

2లో..

## సుప్రీం కోర్టులో సంచలన పిటిషన్

**- చిన్నారుల కిడ్నాప్‌లపై ఇక దేశమంతా ఒకేలా!**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న చిన్నారుల అపహరణలు, కిడ్నాపింగ్ ఘటనలపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో ఒక అత్యంత కీలకమైన ప్రజాప్రయోజన పిటిషన్ దాఖలైంది. పిల్లలు అదృశ్యమైనప్పుడు విచారణ ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నివారించేందుకు, దేశమంతటా ఒకే రకమైన ప్రత్యేక విచారణ వ్యవస్థను రూపొందించాలని ప్రముఖ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. చిన్నారుల

2లో..

## పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవ్

**- కొండా సురేఖ వివాదంపై మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మంత్రి కొండా సురేఖ వివాదంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడం పార్టీ పరంగా బాధాకరమైన విషయమే అయినప్పటికీ, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినప్పుడు ఇటువంటి కఠిన చర్యలు తప్పవన్నారు. ఇందుకు ఏఐసీసీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని ఆయన తెలిపారు. పార్టీ అంతర్గత విషయాలను, అసంతృప్తులను చర్చించానికి అనేక వేదికలు ఉన్నాయన్నారు. అలా కాకుండా బహిరంగ వేదికలపై వ్యాఖ్యలు చేయడం క్షమించరాని తప్పు అవుతుందన్నారు. క్రమశిక్షణ దాటితే మాట్లాడితే ఎవరైనా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.
కొండా సురేఖ తీరుతోనే కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకుందని

2లో..

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

**- మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు.

2లో..

## సగం కాలుష్యం మీవల్లే, ట్యాక్స్‌లకు కూడా ఎగనామం

**- ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్‌పై పవన్ కళ్యాణ్ ఆగ్రహం**

- గోదావరిలోకి ఆంధ్రా పేపర్ మిల్లు పరిమితికి మించి వ్యర్థాలు విడుదల
- పన్ను చెల్లించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తారా?
- సమన్స్ జారీ చేయాలంటూ పవన్ కళ్యాణ్ ఆదేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాజమహేంద్రవరం నగర కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్ నుంచే వస్తుందంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం నగరం మొత్తం దాదాపు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే, మీరొక్కరే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు ఉత్పత్తి చేస్తున్నారని నేరుగా వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా పుష్కరకాలం కిందట ప్రభుత్వానికి పన్ను కట్టారని కానీ కాలుష్యాన్ని మాత్రం యథేచ్ఛగా వెదజల్లుతున్నారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 2016 తర్వాత కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు గానీ ఒక్క రూపాయి కూడా పన్ను కట్టలేదంటూ పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు.

2లో..

## కొడంగల్లో అభివృద్ధి పనులు పరిశీలన

**- నిర్మాణాల నాణ్యతలో రాజీపడొద్దని సీఎం ఆదేశం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాం?ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

**- ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశం**



అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ

2లో..

## నేను సీఎం కావాలనుకుంటున్నా

**- కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు**

- దమ్ముంటే హరీష్‌రావు భార్య నాపై పోటీ చేయాలి
- తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్న కవిత
- బీజేపీతో హరీశ్ రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. తన రాజకీయ భవిష్యత్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన కవిత తాను తెలంగాణ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నానని బహిరంగంగా వెల్లడించారు.
అంతేకాదు తన రాజకీయ ప్రత్యర్థులకు సవాల్ విసురుతూ హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని పేర్కొన్నారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు

2లో..

## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం

**- జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే,

2లో..

## కొండా సురేఖకు వరుస షాక్‌లు

- భద్రత తగ్గింపు, గన్ మెన్లు వెనక్కి - బుల్లెట్ ప్రూఫ్ వాహనం స్వాధీనం
- మంత్రి పదవి నుంచి తొలగించిన మరుసటిరోజే చర్యలు

2లో..



## కోర్టు ఆదేశాల బేఖాతరు..

### నిందితురాలికి జ్యుడీషియల్ రిమాండ్

**- గడువిచ్చినా దాఖలుకాని ష్యూరిటీలు, సరైన చిరునామా - ఈ నెల 11 వరకు కస్టడీ విధిస్తూ న్యాయస్థానం ఆదేశం**

**- ఖమ్మం జిల్లా మహిళా కారాగారానికి ఏ2 నిందితురాలి తరలింపు**



ఖమ్మం(ప్రశ్న న్యూస్) న్యాయస్థానం ఆదేశించిన మేరకు నిర్దేశిత ష్యూరిటీలు, ప్రస్తుత నివాస చిరునామా సమర్పించడంలో విఫలమైన కేసులో ఏ2 నిందితురాలు సంకసర్ల సువర్ణకు ఖమ్మం కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. జన్మాష్టమి పర్వదిన వేళ గురువారం నాటి విచారణలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ నెల 11వ తేదీ వరకు ఆమెను జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ ఖమ్మం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి–కమ్–రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం ఖానాపురం హవేలి పోలీసులు ఆమెను ఖమ్మం జిల్లా మహిళా కారాగారానికి తరలించారు.

**- చిరునామా గల్లంతు.. వారెంట్ జారీ**

ఖానాపురం హవేలి ఠాణా పరిధిలో నమోదైన సీసీ నెం. 2372/2021 కేసు న్యాయస్థానంలో విచారణలో ఉంది. గతంలో సువర్ణ పేర్కొన్న చిరునామాలో ఆమె నివసించడం లేదని పోలీసులు నివేదిక ఇవ్వడంతో సమన్లు వెనక్కి వచ్చాయి. దీంతో జులై 27న కోర్టు ఆమెపై నాన్–బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేస్తూ ఆగస్టు 18కి వాయిదా వేసింది. ఆ రోజున నిందితులు ఏ2 నుంచి ఏ4 వరకు కోర్టుకు హాజరుకాగా, ఏ3, ఏ4లకు చెరో రూ.25,000 చొప్పున రెండు ష్యూరిటీలు, వ్యక్తిగత బాండ్ సమర్పించాలని ఆదేశించింది. అదే సమయంలో వారెంట్ రద్దు కోరుతూ సువర్ణ సీఆర్‌పీసీ సెక్షన్ 70(2) కింద పిటిషన్ దాఖలు చేయగా, ప్రస్తుత నివాస చిరునామాతో పాటు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశిస్తూ సెప్టెంబరు 3కి గడువు ఇచ్చింది.

**- గడువు ముగిసినా తప్పని నిర్లక్ష్యం**

సెప్టెంబరు 3న కేసు మళ్లీ విచారణకు రాగా ఏ2 సువర్ణ, ఏ3 కోర్టుకు హాజరయ్యారు. ఏ2కి సంబంధించిన క్రిమినల్ ఎంపీ నెం. 1403/2026 పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కోర్టు నిర్దేశించిన గడువులోగా ష్యూరిటీలు గానీ, ప్రస్తుత నివాస చిరునామా గానీ సమర్పించలేదు. ఆదేశాల అమలులో అలసత్వాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం సువర్ణకు ఈ నెల 11 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. తదుపరి విచారణను నిందితుల పరిశీలన నిమిత్తం అదే తేదీకి వాయిదా వేసింది.

**న్యాయ వర్గాల్లో చర్చనీయాంశం**

సమన్లు వెనక్కి రావడం మొదలుకొని నాన్–బెయిలబుల్ వారెంట్, ష్యూరిటీల దాఖలుకు గడువు కల్పించినా సమర్పించకపోవడం, చివరకు జ్యుడీషియల్ కస్టడీకి దారితీయడం స్థానిక న్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తోటి నిందితులు ప్రక్రియను కొనసాగిస్తుండగా, ప్రధాన నిందితురాలికి ష్యూరిటీలు లభించలేదా లేక సహ నిందితులు ఆమెకు అండగా నిలవలేదా అన్న కోణంలోనూ చర్చలు సాగుతున్నాయి. కోర్టు ఆదేశాల అనంతరం ఖానాపురం హవేలి పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని, న్యాయ ప్రక్రియ పూర్తి చేసి ఖమ్మం మహిళా జైలుకు తరలించారు.

# మచిలీపట్నం ఎస్ఐ దౌర్జన్యానికి పాల్పడ్డాడు అంటూ యువకులు ఆరోపణ.

- పాము నాగ గణ బిక్షాలరావు అలియాస్ డూండీ వ్యాపారం పేరుతో 25 లక్షలు రూపాయలు తీసుకొని మోసం...
- న్యాయం చేయమని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా ఎస్సై యువకుడి పీక పట్టుకుని దాడికి పాల్పడితే భయంతో బయటకు పరుగు తీసిన యువకులు
- యువకుడి మెడకు స్వల్ప గాయం.....

**విజయవాడ** ఇటీవల ఉమ్మడి కృష్ణాజిల్లాల విజయవాడ లో పోలీసుల పనితీరు వివాదాస్పదంగా మారిన కొంతమంది పోలీసుల పనితీరులో మార్పు రావడం లేదు అని తెలుస్తోంది. మచిలీపట్నం పోలీస్ స్టేషన్ ఎస్ఐ దురుసు ప్రవర్తన యువకులు బెంబేలెత్తి పోలీస్ స్టేషన్ నుండి బయటకు పరుగులు తీశారు. బాధితుడి కథనం ప్రకారం మారుమూడి విక్టర్ ప్రసాద్ మేనల్లుడు వ్యాపారం పేరుతో తన వద్ద నుండి పాము నాగ గణ బిక్షాలరావు అలియాస్ (డుండి) 24 లక్షలు రూపాయలు వసూలు చేసి మోసం చేశారని యువకులు ఆరోపించారు... దీనికి సాక్ష్యంగా అగ్రిమెంట్ కూడా రాసిచ్చారని తెలిపారు...అగ్రిమెంట్ గడువు దగ్గరికి రావడంతో ఇంటికి వెళితే ఆరు నెలల నుండి కనిపించకుండా తిరుగుతూ ఇంట్లో ఎవరు ఉండకుండా వెళ్లిపోయారని అప్పటినుంచి వాళ్ళని వెతుకుతున్నామని తమ ఆవేదన వ్యక్తం చేశారు.... శుక్రవారం పాము నాగ గజ బిక్షాలరావు (డుండి) భార్య, తల్లి కనిపిస్తే డబ్బులు ఇవ్వాలని పోలీస్ స్టేషన్ కు పిలిపించగా ఎస్సై ఏకపక్షంగా వ్యవహరించి దుర్గాప్రసాద్ యువకుడి పీక పట్టుకుని ఎస్సై బెదిరింపులకు పాల్పడ్డారని, యువకులు భయంతో పోలీస్ స్టేషన్ లో నుండి భయంతో పరుగులు తీసి బయటికి వచ్చామని తెలిపారు....బంగారం, ఆయిల్, పలు వ్యాపార పేర్లతో కొంతమందిని మోసం చేసి కోటి రూపాయల వరకు వసూలుకు పాల్పడి మోసం చేశారని, ఒక్కొక్కరిగా బాధితులు బయటికి వచ్చి డూండీ పై ఫిర్యాదు చేస్తున్నారు.తమ కుటుంబం మధ్యతరగతి కుటుంబమని డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వకపోతే చావే శరణమని యువకుడు కన్నీటి పర్యంతమయ్యాడు

# 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మహిళల ఆగ్రహం

- దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దపల్లిలో మహిళా సదస్సు
- నిరసన, వంటావార్పు



**పెద్దపల్లి** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.మహిళలంతా కలిసి రోడ్డుపైనే కూరగాయలు తరిగి వంటావార్పు నిర్వహించారు. రెండు గంటల పాటు ఆటపాటలు, బతుకమ్మ పాటలతో పాటు ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ఎత్తిచూపే పాటలు పాడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ అమలయ్యాయని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా గుర్తుచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెంచుతామని చెప్పిన పెన్షన్లు, విద్యార్థినీలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి?షాదీముబారక్ మొత్తాన్ని పెంచుతామని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళల జీవితాల్లో మార్పు తీసుకువస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు."ఒక్క నెల ఆగండి.. రూ.4,000 పెన్షన్ ఇస్తాం" అని ఎన్నికల సమయంలో చెప్పిన రేవంత్ రెడ్డి, వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఆ హామీని ఎందుకు అమలు చేయలేదని దాసరి మనోహర్ రెడ్డి ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని గ్యారెంటీ కార్డులు ఇచ్చి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వెయ్యి రోజులు గడిచినా ఒక్కొక్క హామీని తప్పించుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.కేసీఆర్ హయాంలో మహిళల సంక్షేమానికి అమలు చేసిన పథకాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఒంటరి మహిళలకు పెన్షన్, బీడీ కార్మికులకు పెన్షన్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలతో మహిళలకు అండగా నిలిచిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి మహిళలు, పిల్లలు, కుటుంబాల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి మహిళలను మహారాణులుగా గౌరవించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.విద్యార్థినీలకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి, కనీసం సైకిల్ కూడా ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని దాసరి మనోహర్ రెడ్డి ఎద్దేవా చేశారు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

# ఇంటింటా చిన్ని రాధాకృష్ణుల సందడి

- రాధాకృష్ణుల వేషధారణలో అలరించిన చిన్నారులు.





**తుగ్గలి:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తుగ్గలిలో ఇంటింటా భక్తి పారవశ్యం వెల్లివిరిసింది.చిన్నారులు చిన్ని రాధాకృష్ణుల అవతారంలో ముస్తాబై ఇంటిలోనే అందరినీ అలరించారు.బాలురు పంచె కట్టుతో నెమలి పింఛం కిరీటం,చేతిలో పిల్లనగ్రోవితో చిన్ని కృష్ణుడిలా,బాలికలు రంగురంగుల పట్టు పరికిణీలు,మెరిసే ఆభరణాలతో రాధాదేవి లాగా సాక్షాత్కరించారు.చిన్ని రాధాకృష్ణులు ఇల్లంతా బుడిబుడి అడుగులతో తిరుగుతూ పండుగ వాతావరణం నెలకొల్పారు.పిల్లల ఈ ముద్దుల అలంకరణను చూసి కుటుంబ సభ్యులు,బంధువులు ఆనందంతో మురిసిపోయారు.మన సంస్కృతి, సంప్రదాయాలను,భక్తి భావాన్ని చిన్నారులలో చిన్ననాటి నుండే పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని తల్లిదండ్రులు తెలిపారు.

# శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డిని పలువురు యాదవ సంఘం నాయకులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజనేని చంద్ర, రవికుమార్, వెంకట రాముడు, బొట్టు స్వామి, గొంగటి హుస్సేన్ రెడ్డి, కళ్యాణ్ రెడ్డి, వేణు యాదవ్, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు యాదవ సంఘం నాయకులు గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన రైల్వే కోడూరు రూరల్ సిఐ



**చిట్వేలి** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రైల్వే కోడూరు గ్రామీణ పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాసులు, చిట్వేలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. వినోద్ కుమార్ చిట్వేలి మండలం లోని యల్లమరాజు చెరువు ను సందర్శించి, వినాయక విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి చేపట్టాల్సిన భద్రతా మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ చెరువులో చిట్వేలి మండలంతో పాటుగా పెనగలూరు మండలం లోని కొన్ని ప్రాంతాల నుంచి సుమారు 100 వరకు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో, పెద్ద సంఖ్యలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యుల వాహనాలు వచ్చే అవకాశం ఉందని గుర్తించారు. అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సీఐ సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు, పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, చెరువు లోని పిచ్చి మొక్కలు, వ్యర్థాలు, ఇతర అవరోధాలను తొలగించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.భక్తులు ఉత్సవ కమిటీ సభ్యులు సురక్షితంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేలా బారికేడ్లను, భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు.నిమజ్జనం సమయంలో భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, అత్యవసర పరిస్థితులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా సమన్వయంతో నిర్వహించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, ఫైర్ అన్ని శాఖలతో సమన్వయము చేసుకొని సమిష్టిగా పనిచేయాలని సీఐ సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

# స్వదేశీ 'కామికేజ్'కు మరో బలం

- మ్యూనిషన్స్ ఇండియా- డ్రోగో ఏరోస్పేస్ మధ్య కీలక ఒప్పందం
- లోయిటరింగ్ మ్యూనిషన్, యూఏవీ వ్యవస్థల అభివృద్ధికి ఎంవోయూవార్‌హెడ్ సాంకేతికతలో ఎంఐఎల్ నైపుణ్యం..
- యూఏవీ రూపకల్పనలో డ్రోగో ఏరోస్పేస్ సామర్థ్యం

**హైదరాబాద్,** భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికతకు మరింత ఊతమిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (డీపీఎస్‌యూ) అయిన మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ (ఎంఐఎల్)తో డ్రోగో ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసే మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీలు), లోయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధి, సమీకరణపై రెండు సంస్థలు ఇక నుంచి కలిసి పనిచేయనున్నాయి. ఈ ఒప్పందంపై డ్రోగో ఏరోస్పేస్ నుంచి డ్రోగో ఏరోస్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ యశ్వంత్ బొంతు ,ఎం ఐ ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార్ వైభవ్ గౌర్ పూణే లో శుక్రవారం సంతకాలు చేశారు. రెండు సంస్థల నైపుణ్యాలు ఒక్కటిగా..ఈ భాగస్వామ్యంలో డ్రోగో ఏరోస్పేస్ యూఏవీ ప్లాట్‌ఫామ్ రూపకల్పన, అభివృద్ధి, తయారీతో పాటు సంబంధిత ఖాళీ పేలోడ్ హార్డ్‌వేర్ అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించనుంది. మరోవైపు ఎంఐఎల్ తనకు ఉన్న రక్షణ మందుగుండు సామగ్రి, వార్‌హెడ్ సాంకేతికతలోని నైపుణ్యాన్ని అందించనుంది.ఎంఐఎల్ భారత ప్రభుత్వ యాజమాన్యంలోని రక్షణ రంగ తయారీ సంస్థ. దీని ప్రధాన కార్యాలయం పూణేలో ఉంది. 2021 లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డ్‌ను ఏడు వేర్వేరు ప్రభుత్వ రంగ సంస్థలుగా పునర్నిర్మించినపుడు దీన్ని స్థాపించారు. భారత సాయుధ దళాలు, విదేశీ మిలిటరీలు, దేశీయ పౌర అవసరాల కోసం ఇక్కడ మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు, రాకెట్లు, బాంబులను తయారు చేస్తారు. మ్యూనిషన్స్ డిజైన్, పేలుడు పదార్థ వ్యవస్థలు, పేలోడ్ ఫిల్లింగ్, ఫ్యూజింగ్, మాడ్యులర్ మ్యూనిషన్ అభివృద్ధి వంటి విభాగాల్లో ఎంఐఎల్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఒప్పందంలో భాగంగా వినియోగించనుంది.


**యూఏవీ మ్యూనిషన్ సమీకరణపై ఉమ్మడి కసరత్తు** రెండు సంస్థలు కలిసి మ్యూనిషన్?యూఏవీ సమీకరణ, స్థిర భద్రతా మూల్యాంకనం, ఫీల్డ్/రేంజ్ పరీక్షలు, నాణ్యతా ధ్రువీకరణ వంటి తదుపరి దశలపై పనిచేయనున్నాయి. దీంతో యూఏవీ ఇంజినీరింగ్, మ్యూనిషన్ సాంకేతికత, పేలోడ్ వ్యవస్థలు, రక్షణ రంగ ప్రమాణాలకు అనుగుణమైన సమీకరణ సామర్థ్యాలను ఒకే వేదికపైకి తీసుకురానున్నాయి

# డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ముడియం చిన్ని ఎన్నిక



**బద్వేలు** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు ఈనెల 1 2 3 తేదీలలో నెల్లూరు నగరంలో నిర్వహించడం జరిగిందని ఈ రాష్ట్ర మహాసభలలో బద్వేల్ పట్టణానికి చెందిన ముడియం చిన్నిని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీకి ఎన్నిక చేయడం జరిగిందని ఎన్నిక చేసిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్నికైన ముడియం చిన్ని మాట్లాడుతూ.... రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక ఇతర దేశాలకు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని వారు తెలిపారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు నిరుద్యోగ యువతీ యువకులకు మేం అధికారంలోకి వస్తే ప్రత్యేక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ జిల్లాలో సేయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఈ జిల్లాకు కొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని దాని ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దానికి వీలుంటుందని వారు తెలిపారు నిరుద్యోగ సమస్యల పైన పోరాడుతున్నటువంటి ఏకైక యువజన సంఘం డివైఎఫ్ఐ మాత్రమేనని వారన్నారు నిరుద్యోగులు సమస్యలతో పాటు జిల్లాలో పరిశ్రమల కోసం ఉపాధి అవకాశాల కోసం జిల్లా అభివృద్ధి కోసం డివైఎఫ్ఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు ఈ రాష్ట్ర కమిటీ ఎన్నిక చేసినటువంటి ఆలిండియా నాయకత్వానికి రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేసుకోవడం జరిగిందన్నారు

# తాడిపత్రిలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం...



**తాడిపత్రి** తాడిపత్రి పట్టణంలోని కొత్త కూరగాయల మార్కెట్ పక్కన కాంప్లెక్స్లో ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం రిటైర్డ్ మండల విద్యాధికారి సత్యనారాయణ ఘనంగా ప్రారంభించారు. నిరుపేద మహిళలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందజేస్తామని ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, మహబూబ్ బాషా,శ్రీహరి, గురప్ప, నారా బోయిన శంకర్, రామాంజనేయులు, విజయలక్ష్మి, రామేశ్వర్ రెడ్డి, గోమతి, విజయలక్ష్మి ఇంకా తదితర సభ్యులు మహిళలు పాల్గొన్నారు

# అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు...

- గనుల శాఖకు హైకోర్టు ఆదేశాలు

బాపట్ల,: బాపట్ల జిల్లాలో జరుగుతున్నఅక్రమ ఇసుక తవ్వకాలు, అక్రమ ఇసుక రవాణా, సిలికా మైనింగ్ అనుమతుల దుర్వినియోగంపై జర్నలిస్ట్ నాయుడు నాగార్జున రెడ్డి సమర్పించిన ఫిర్యాదుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం స్పందించింది. జర్నలిస్ట్ నాయుడు నాగార్జున రెడ్డి 2026 ఆగస్టు 19న చేసిన ఫిర్యాదును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం గనులు, భూగర్భశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అవసరమైన చర్యల కోసం ఫార్వర్డ్ చేసింది. బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం, మండలాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, కేటాయింపు భూములు, వాన్‌పిక్ భూముల్లో అనధికార తవ్వకాలు, సిలికా మైనింగ్ అనుమతుల దుర్వినియోగంపై సమగ్ర తనిఖీలు, విచారణ చేపట్టాలని ఫిర్యాదులో కోరారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమ తవ్వకాలను గుర్తించడం, యంత్రాలను స్వాధీనం చేసుకోవడం, డిమాండ్ నోటీసులు జారీ చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో చర్యలు తీసుకున్న ప్రాంతాల్లోనూ అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో పుల్లరిపాలెం? ఊటుకూరి సుబ్బయ్యపాలెం, వెదుళ్లపల్లి, తులసీనగరం?కావూరివారిపాలెం, ఈపురుపాలెం, గవనివారిపాలెం, సవరపాలెం, బోయినవారిపాలెం, కుందేరు తదితర ప్రాంతాలను కూడా సమగ్ర తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అక్రమంగా తవ్విన ఇసుక పరిమాణాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో నిర్ధారించడంతో పాటు, సీసీ కెమెరా దృశ్యాలు, వాహనాల వివరాలు, మైనింగ్ అనుమతులు, రెవెన్యూ రికార్డులు, రవాణా వివరాలను పరిశీలించాలని ఫిర్యాదులో కోరారు. హైకోర్టు కార్యాలయం ఫిర్యాదును చర్యల కోసం గనుల శాఖకు పంపిన నేపథ్యంలో, అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, అక్రమాలకు పాల్పడుతున్న వారే తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదుదారు పేర్కొంటున్న నేపథ్యంలో, వారు ఎంతటి వారైనా రాజకీయ పలుకుబడి, హోదా, ప్రభావాలకు తావులేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

# తుగ్గలిలో ఆధ్యాత్మిక శోభతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



తుగ్గలి: ఉదయం న్యూస్: మండల కేంద్రమైన తుగ్గలి నందు ఆధ్యాత్మిక శోభతో శ్రీకృష్ణ జన్మాష్టమి మొదటిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆధికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ప్రబోధా సేవా సమితి తుగ్గలి శాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం నుండి భక్తి పారవశ్యంతో శ్రీకృష్ణుని ప్రతిమలకు పూలమాలలు వేసి ధూప దీప నైవేద్యాలను సమర్పించి మంత్రోచ్చారణతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు శ్రీ ప్రబోధానంద యోగీశ్వరుల విలువైన సందేశాలను ప్రజలకు వివరించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు,అది ధర్మ పునరుద్ధరణకు ప్రతీక.భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు అందించిన జ్ఞాన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని,శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల బోధనలతో సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం,మానవ సేవా తత్పరత పెంపొందుతోందని వారు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం రోజున మధ్యాహ్నం 2 గంటల నుండి శ్రీకృష్ణుని ప్రతిమతో గ్రామం నందు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రబోధా సేవా సమితి సభ్యులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రబోధా సేవా సమితి సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు న్యాయం జరిగేది ఎప్పుడు?

- సర్వేలతో కాలయాపన చేస్తున్నారా..?
- రిటైర్డ్ వీఆర్వో భూ సర్వేలకు వెళ్లడంపై గ్రామస్తుల అనుమానాలు



తిమ్మం దొడ్డి గ్రామానికి చెందిన బాధిత రైతు గొల్ల వీరభద్రుడికి గత 15 ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. న్యాయం కోసం ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో బాధిత రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ అధికారులు భూ సర్వేలు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ సర్వేల అనంతరం స్పష్టమైన నివేదిక లేదా తుది పరిష్కారం కనిపించడం లేదని రైతు వాపోతున్నారు.

# పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం

**- కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్**





పటన్ చెరు(ప్రశ్న న్యూస్) మానవాళి మనుగడపై అత్యంత ప్రభావం చూపుతున్న పర్యావరణ మార్పుల నేపథ్యంలో విషతుల్యమైన ప్లాస్టిక్, ప్లాస్టాప్ పారిస్ వంటి వాటిని విచ్చలవిడిగా వాడకాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై ముందుకు సాగాలని కామధేను ఫౌండేషన్, అధ్యక్షులు పి. వెంకటేశ్ పిలుపునిచ్చారు. కామధేను ఫౌండేషన్, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం నాడు పటాన్ చెరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కే. క్రిష్ణ మోహన్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 'ప్లాస్టిక్ నివారణ – పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పి. వెంకటేశ్ మాట్లాడుతు వాతావరణంలో సంభవించే పెను మార్పులు, కాలుష్య ప్రభావంతో తీవ్ర ఒత్తిడి, అనారోగ్య సమస్యలతో మానవాళి మనుగడకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా వాతావరణ కాలుష్యంతో మానవాళికి పొంచి ఉన్న ముప్పు పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి పద్మావతి మాట్లాడుతు ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి, జీవకోటికి తీవ్రమైన హాని వాటిల్లుతోందని అన్నారు. ముఖ్యంగాను భూమిలో ప్లాస్టిక్ కరగడానికి వందల ఏళ్లు పడుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూసారం తగ్గి చౌడుబారడమే కాక నీటి కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడటం వల్ల వాటిలో ఉండే రసాయనాలు క్యాన్సర్ వ్యాప్తికి దారితీస్తాయని, మనం తినే ఆహారం, తాగేనీటి ద్వారా విషపూరిత రసాయనాలు మన శరీరంలోకి చేరి శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే ప్లాస్టిక్‌ను తగులబెట్టడం వల్ల విడుదలయ్యే విషవాయువులు మన ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయని హెచ్చరించారు. రోడ్లపై పడేసిన ప్లాస్టిక్ కవర్లను తిని ఆవులు, ఇతర జంతువులు చనిపోతున్నాయని, నదులు, సముద్రాల్లో కలిసే ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల చేపలు, తాబేళ్లు ఇతర జీవులు ప్రాణాలు కోల్పోతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి సందర్భంగా ప్లాస్టాప్ పారిస్ విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

### జల కాలుష్యానికి కారణం ప్లాస్టాప్ పారిస్ విగ్రహాలు

ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గోన్న పటోళ్ళ చంద్రశేఖర్ మాట్లాడుతు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి,ప్రజారోగ్యానికి అనేకమైన తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్లాస్టప్ పారిస్ విగ్రహాలు నీటిలో సులభంగా కరగవని, వీటిని నిమజ్జనం చేసినప్పుడు నీటిలో కరగకుండా అలాగే ఉండిపోవడంతో నీటి వనరులు కలుషితమవడమే కాక విగ్రహాల అవశేషాలు నేలలో కలిసిపోకపోవడం వల్ల భూసారం తగ్గి, నేల నిర్వీర్ణమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తు, వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల అవశ్యకతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం సాలిడ్ వేస్టేజ్ మేనేజ్మెంట్ పై పొల్యూషన్ బోర్డు అధికారి రవీందర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. క్రిష్ణ మోహన్ మాట్లాడుతు పర్యావరణ కాలుష్యం తీవ్ర అనర్థాలకు దారితీస్తుందని, మానసిక ఒత్తిడి, అనారోగ్య సమస్యలు, నీటి కాలుష్యం, వర్షాభావం పరిస్థితుల వంటి ప్రతికూల అనర్థాలతో మానవాళికి పొంచి ఉన్న ముప్పు పై ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తు, పర్యావరణ కాలుష్య నివారణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామధేను ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్, పాఠశాల ఉపాధ్యాయులు మోహన్, సుధారాణి, నరసింహులు, జైపాల్, ధనరాజు, రూప్ సింగ్, రాధ, పద్మజ, మాధవి, నాగ రత్నమాల, సుధాకర్ రెడ్డి, ఎస్ సత్తయ్య, రఘుపతి, భూమయ్య, కవిత, రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీ బసవంతరావుతో పాటు ఆరు వందల మంది విద్యార్థులు పాల్గోన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏ ఎస్ రావ్ నగర్లో ఘనంగా

# వంటా వార్పు కార్యక్రమం



కాప్రా(ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ప్రజలకు ఇచ్చిన420 హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులుమండిపడ్డారు.పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఏడు రోజుల కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజక వర్గం లోని ఏ ఎస్ రావ్ నగర్లో నిర్వహించిన వంటా వార్పు కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.మహిళలకు, వృద్దులకు ఇస్తానాన్న పిన్షన్లు ఇవ్వకుండా కాలయాప న చేస్తూ మహిళలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ కు రోజులు దగ్గరపడ్డాయని ,మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవారకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు డివిజన్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి,బి ఆర్ ఎస్ సీనియర్ నాయయకులు బండారి నీలం రెడ్డి,సింగిరెడ్డి సోమశేకర్ రెడ్డి,మనెమ్మ,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా చింతకింది ప్రవీణ్

**- వైభవంగా గణేష్ ఉత్సవాల నిర్వహణే లక్ష్యం: చింతకింది ప్రవీణ్**





**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా చింతకింది ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రామంతపూర్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు తిండేరు హనుమంతరావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు రమేష్ తదితరులు ప్రవీణ్‌ను అభినందించి శు భాకాంక్షలు తెలిపారు.తనపై నమ్మకంతో హబ్సిగూడ డివిజన్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన సమితి పెద్దలకు, నాయకులకు చింతకింది ప్రవీణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో, ఘనంగా మరియు వైభవంగా నిర్వహించేందుకు అందరినీ కలుపుకొని కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.అలాగే గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, ఉత్సవాలు ప్రశాంతంగా, క్రమశిక్షణతో జరిగేలా సమితి సభ్యులు, నిర్వాహకులు మరియు భక్తులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రుద్ర శేఖర్, మాలకొండ రెడ్డి, సోమ శ్రీనివాస్ గుప్త, రామేశ్వరరావు, ఓబుల్ రెడ్డి, చెల్లోజు ఎల్లాచారి, వార్ల బాలరాజు, రాపోలు సాయినాథ్, కొండేరు స్రవంతి తదితరులు పాల్గొని చింతకింది ప్రవీణ్‌కు అభినందనలు తెలిపారు.

## గంగా తెప్పోత్సవ శోభాయాత్రను విజయవంతం చేయాలి

**- టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ గంగపుత్రుల ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు తెలంగాణ గంగా తెప్పోత్సవ శోభాయాత్రను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర తెలిపారు.ఖైరతాబాద్ ఏడు గుళ్ల నుంచి గంగ తెప్ప పల్లకి ఊరేగింపు ప్రారంభమై హుస్సేన్ సాగర్ గంగమ్మ దేవాలయం వరకు భారీ శోభాయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు గంగపుత్రుల ఐక్యతను చాటిచెప్పే ఈ కార్యక్రమానికి రాష్ట వ్యాప్తంగా ఉన్న గంగపుత్రులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.గంగమ్మ తల్లి ఆశీస్సులతో గంగపుత్రుల ఐక్యతను చాటుదాం అని రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు.

## ఎల్ ఎల్ సి కెనాల్‌కు మన వాటా హనువాళ్ సరిహద్దు దగ్గర 580 క్యూసెక్కులు నీళ్లు రావాలి.

**- ఎండిపో తున్న పంటలను నీళ్లు వదిలి రక్షించాలి.**

**- రైతు సంఘం డిమాండ్**

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎల్ ఎల్ సి కెనాలను రైతు సంఘం బృందం మన ఆంధ్ర సరిహద్దు హనవల్ దగ్గర గేజును పరిశీలన చేస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కే మల్లయ్య సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ ని నో ప్రభావంతో అడపాదడపా వర్షాలకు రైతులు పత్తి, మిరప, ఉల్లి ఇతర పంటలు వేసినారు.

వర్షా లు సరిగా లేకపోవడం వల్ల కొన్నిచోట్ల పంటలు ఎండిపోయినాయి .మన దగ్గర వర్షాలు లేకపోయినా డ్యామ్ పై భాగంలో వర్షాలు రావడం వల్ల డ్యాం పూర్తిగా నిండినది. డ్యాం నుండి ఎల్ ఎల్ సి కెనాలకు నీళ్లు వదిలి నారు. నీళ్లను చూసి రైతులు సంతోషించినారు. కానీ నాయకులు, అధికారులు ఇప్పటివరకు పిల్ల కాలువలకు ,వంకలకు నీళ్లు వదలకుండా కిందకు తీసుకుపోవడం సరైనది కాదని వారు అన్నారు. మన నీటి వాటా 680 క్యూసెక్కులు డ్యాము నుంచి నీళ్లు వదిలినారు. మన హను వాళ్ సరిహద్దు దగ్గర 580 క్యూసెక్కులు నీళ్లు రావాలి, కానీ నిన్నటి వరకు 200, 250 క్యూసెక్కులకు మించి నీళ్లు రాలేదు.కూటమి నాయకులు మన వాటా నీళ్ళు తెప్పించడంలో విఫల మైనారు. రైతులను దృష్టిలో ఉంచుకొని మన నాయకులు వెంటనే స్పందించి ఎల్ ఎల్ సి మెయిన్ కెనాల్ పై పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి ,మన నీటి వాటకోసం, రైతుల పంటలను రక్షించడానికి మనందరం కృషి చేద్దామని రైతు సంఘం నాయకులు అన్నారు. రైతులకు న్యాయం జరగకపోతే రైతులందరూ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయగలమని వారు హెచ్చరించినారు.ఈరోజు పర్యటనలో రైతు సంఘం నాయకులు ఈరన్న, భాష ,హనుమంత రెడ్డి, నరసన్న ,హనుమంతుమహేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై భగ్గుమన్న సత్యవతి రాథోడ్

**వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటని ప్రశ్న**

**మహబూబాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ, సత్యవతి రాథోడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహబూబాబాద్, కేసముద్రం మండల కేంద్రాల్లో నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా నిర్వహించిన వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని సత్యవతి రాథోడ్ గారు హెచ్చరించారు, మాటలతో కాలం గడపడం తప్ప ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు "వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో హామీలు అమలు కాలేదు.. ప్రజల కష్టాలు మాత్రం పెరిగాయి,ఇకనైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలి లేదంటే ప్రజల తరఫున బీఆర్ఎస్ మరింత ఉధృతంగా పోరాటం చేస్తుంది" అని సత్యవతి రాథోడ్ గారు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత , మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులుశ్రీ బానోత్ శంకర్ నాయక్ మరియు వివిధ మండలాల మాజీ అధ్యక్షులు మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు సర్పంచులు, బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు సమస్యను పరిష్కరించండి మహాప్రభు

**- అధికారులు నిర్లక్ష్యం వాహనదారులకు శాపం**

**దేవీపట్నం** పోలవరం జిల్లాలోని రంపచోడవరం మండలం,తామరపల్లి పంచాయతీ ప్రజలు రోడ్డు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తామరపల్లి నుంచి ఈతలపాడు వరకు ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. పెద్ద పెద్ద గుంతలు, రాళ్లు తేలిన ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది.

ప్రమాదాలు కూడా తరచుగా జరుగుతున్నాయి.?ఈ రోడ్డు పంచాయతీ కేంద్రానికి ప్రధాన రహదారి. ప్రజలే కాకుండా సచివాలయం సిబ్బంది కూడా ఈ రోడ్డు ద్వారానే ప్రయాణించాలి. పనుల నిమిత్తం సచివాలయానికి వెళ్లే ప్రజలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.తామరపల్లి పరిసర ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాలలో వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఎరువులు సరఫరా చేయడానికి, అలాగే పండించిన పంటను ఆర్బికే ద్వారా తరలించడానికి ఈ రోడ్డు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం అసాధ్యంగా మారుతుంది. దీనివల్ల రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుంది.?గ్రామస్తులు గతంలో ఎన్నోసార్లు గ్రీవెన్స్ డే లో దరఖాస్తు చేసుకున్నారు, కానీ ఫలితం లేదు. స్థానిక ఎమ్మెల్యే కి కూడా ఈ సమస్య గురించి విన్నవించినప్పటికీ, కేవలం హామీలు మాత్రమే లభిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.?కొన్ని నెలల క్రితం జిల్లా కలెక్టర్ శ్రీ దినేష్ కుమార్ మా తామరపల్లి పంచాయతీకి వచ్చినప్పుడు ప్రజల కష్టాలు విన్నారు. ఆయన కూడా రోడ్డు సమస్య పరిష్కారం కోసం తన వాగ్దానాన్ని ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.కాబట్టి, మేము గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారికి విన్నవించుకుంటున్నాము. మా తామరపల్లి ప్రజల కష్టాలను, ఇబ్బందులను అర్థం చేసుకుని, మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుకుంటున్నాము. మా వ్యవసాయ రంగం అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ రోడ్డు ఎంతో అవసరం. కలెక్టర్ మా విన్నపాన్ని పరిశీలించి, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాము.

## పాలన చేయలేక చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి: మంత్రి వినోద్

**- సీఎం వద్దే కీలక శాఖలు.**

**అయిన ప్రజా సమస్యలకు పరిష్కారం ఎక్కడ.?**

**- అధికారులపై పట్టు లేదా.? పాలనలో హస్తవ్యస్త పరిస్థితులపై**

**బీఆర్ఎస్ నేత మంత్రి వినోద్ ఆగ్రహం**

**- ఇదే పరిస్థితి కొనసాగితే కాంగ్రెస్‌కు**

**11 సీట్లు కూడా రావంటూ సంచలన వ్యాఖ్యలు**



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పాలన సాగిస్తున్నప్పటికీ ప్రజా సమస్యలకు మాత్రం పరిష్కారం దొరకడం లేదన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్న కీలక శాఖల్లోనే పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయని, అధికార యంత్రాంగంపై ప్రభుత్వానికి సరైన నియంత్రణ కనిపించడం లేదని బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ మంత్రి వినోద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల నుంచి కనీస స్పందన కరవవుతోందన్న ఆరోపణలు చేశారు. ప్రజా సమస్యలపై అధికారులను కదిలించాల్సిన ప్రభుత్వం సైతం అసలు పట్టించుకోవడం లేదనే అసంతృప్తి క్షేత్రస్థాయిలో పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### సీఎం శాఖల్లోనే అవినీతి ఆరోపణలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా పర్యవేక్షిస్తున్న శాఖల్లోనే విపరీతమైన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్న విమర్శలు ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేయకపోతే వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కానీ ఒక్క మంత్రి కూడా పట్టించుకోవడంలేదని మంత్రి వినోద్ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

### ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి దెబ్బ.?

ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతుంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం తప్పదన్న రాజకీయ చర్చ మొదలైంది. ఇదే పరిస్థితి కొనసాగితే కాంగ్రెస్‌కు 11 సీట్లు కూడా రావంటూ మంత్రి వినోద్ చేసిన వ్యాఖ్యలు అధికార పార్టీలోనే కలకలం రేపుతున్నాయి. ప్రజా సమస్యలను పరిష్కరించడం, అధికారులను జవాబుదారీగా మార్చడం, అవినీతి ఆరోపణలపై పారదర్శక విచారణ జరిపించడం ప్రభుత్వానికి తక్షణ సవాలుగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుంటున్న ప్రజలు.. ఇప్పుడు వాటి అమలును ప్రశ్నిస్తున్న పరిస్థితి నెలకొంది.

### ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం

పాలనలో వేగం పెంచుతారా.? అధికార యంత్రాంగాన్ని గాడిలో పెడతారా.? లేక ప్రజల అసంతృప్తి ఎన్నికల్లో తీర్పుగా మారుతుందా.? అన్నది వేచి చూడాల్సిందే.

## బోధి పాఠశాలలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**పిడుగురాళ్ళ,** పిడుగురాళ్ళ మండలం తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాఠశాలకు హాజరై సందడి చేశారు.

చిన్నారుల అందమైన వేషధారణలు, పాటలు, నృత్యాలు మరియు రంగవల్లులతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల కేరింతలు, ఆనందోత్సాహాలతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. చిన్నారుల పాటలు, నృత్యాలు, రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించేలా పాఠశాల యాజమాన్యం ఈ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహభరితంగా పాల్గొనడంతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బోధి పాఠశాలలో కన్నుల పండుగ గా జరిగాయి.

# దమ్మన్నపేటలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




**- వీడీసీ చైర్మన్ అతుకుల పెద్ద సాయన్న ఆధ్వర్యంలో ప్రత్యేక్ష పూజలు**

ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ వీడీసీ అధ్యక్షులు అతుకుల పెద్ద సాయన్న ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్క రోజు ముందు నుండి శ్రీకృష్ణ స్వామివారికి అభిషేకాలు,భజన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వీడిసి చైర్మన్ అతుకుల పెద్ద సాయన్న,ఉమేందర్,మోహన్, గంగాధర్,రవి రెడ్డి,అనిల్, వసంత రమేష్, ఆనంద్, హనుమాన్లు, గంగనర్సయ్యా,కుంట చిన్నయ్యా,నందగిరి లక్ష్మణ్,సాయిబాబా, లింబాద్రి, యువకులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముక్కంటేశ్వరుని దర్శించుకున్న ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సభ్యులు



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి దేవస్థానాన్ని ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు,వీరిని శ్రీకాళహస్తిఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఆలయ ఈవో బి కే వెంకటేశ్వర్లు పలకమండలి చైర్మన్ కొట్టేసాయి లు,దక్షిణ గోపురంవద్ద వేద పండితులతో కలసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక స్వామి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు నిర్వహించగా సీఎం రమేష్ జ్ఞానప్రసూనాం బా సమేత వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు దర్శనానంతరం గురు దక్షిణామూర్తి వద్ద ఆలయ వేదపండితుల ఆశీర్వాదం ఇవ్వగ స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ అధికారులు సీఎం రమేష్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి తమ అమ్మవా గారి ఊరు కాబట్టి ఇక్కడికి వచ్చినప్పుడల్లా శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకుంటున్నానని తెలియజేశారు,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట ఇచ్చినప్రకారం రెండు సంవత్సరాలలోనే గోదావరి జలాలను తమ అనకాపల్లి నియోజకవర్గానికి తీసుకురావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, ఈ గోదావరి జలాలతో రాష్ట్రమంతట నీటి కొరత లేకుండా రైతులకు ప్రజలకు లబ్దిదాకంగా ఉంటుందని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం దేవాలయాలకు అందజేస్తున్న ప్రసాద్ స్కీమ్ ద్వారా అధిక నిధులను శ్రీకాళహస్తి దేవస్థానానికి తీసుకుని వచ్చి శ్రీకాళహస్తి దేవస్థానన్నీ అభివృద్ధిపరిచే విధంగా త్వరలోనే కార్యాచరణ చేపడతామని, తద్వారా శ్రీకాళహస్తి దేవస్థానం మరింత స్వభాయానంగా ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు సౌకర్యాలు కల్పించే విధంగా వీలవుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## గజ్వేల్ ప్రజలకు అందుబాటులో లేని కేసీఆర్

**- ఎమ్మెల్యేగా కొనసాగేందుకు నైతిక హక్కు లేదు: కాంగ్రెస్ నేతలు**

**- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ శ్రేణులు**



**గజ్వేల్, ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ఎమ్మెల్యేగా కొనసాగేందుకు ఆయనకు నైతిక హక్కు లేదని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూముకుంట అంక్షారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి విమర్శించారు. కేబినెట్ ర్యాంకు హోదాతో కేసీఆర్‌కు ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు రూ.24 కోట్లు ఖర్చు చేసిందని వారు ఆరోపించారు.శుక్రవారం గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను ఊరేగించి అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కేసీఆర్‌ను గజ్వేల్ ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నప్పటికీ, ఆయన ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బంధువులు, పార్టీ నాయకుల కార్యక్రమాలకు వెళ్తున్న కేసీఆర్ గజ్వేల్ ప్రజల మధ్యకు మాత్రం రావడం లేదని విమర్శించారు.కేసీఆర్ నియోజకవర్గానికి దూరంగా ఉండటంతో గజ్వేల్ అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని, పేదల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోసం నిర్మించిన క్యాంపు కార్యాలయానికి ఇప్పటివరకు కేసీఆర్ అడుగుపెట్టలేదని, అది అనామకులకు అడ్డాగా మారిందని, అక్కడ మద్యం విందులు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రభుత్వ పథకాల అమలులో ఎమ్మెల్యే ప్రోటోకాల్‌కు సంబంధించిన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో లబ్ధిదారులకు సకాలంలో సంక్షేమ పథకాలు అందడం లేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారానికి ఒకసారి గజ్వేల్‌లో సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ అమలుకు నోచుకోలేదన్నారు.ప్రస్తుతం కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. వ్యక్తిగత సమస్యలు, అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో ఆయన ఇక ప్రజల మధ్యకు రావడం కష్టమేనని వ్యాఖ్యానిస్తూ, వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఎర్రవల్లి ఫాంహౌస్ వద్దకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి వెళ్లి కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదని వారు తెలిపారు. ప్రభుత్వ వేతనాలు, సౌకర్యాలు పొందుతూ ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. కేసీఆర్ స్పందించకపోతే నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని నిరసన ర్యాలీలు చేపడతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

**- తెలంగాణ వెయ్యి రోజుల పాలన, అభివృద్ధి, సంక్షేమమే మా ఎజెండా**




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, పేదల సంక్షేమం, విద్య, వైద్యం, సామాజిక న్యాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులకు పంట రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్న వడ్లకు బోనస్ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళా సంఘాలకు రుణాలు, ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ స్థాయిల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థాన అధికారులతో సమీక్షా సమావేశం

**- ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు**

**- శ్రీశైలం మల్లన్న దర్శనానికి వచ్చే ప్రతి భక్తులను తమ ఇంటి వారిలాగా చూడాలని దేవస్థానం సిబ్బంది కి ఆదేశాలు జారీ చేసిన ఈవో**



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) శ్రీశైల దేవస్థాన పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా దేవస్థాన పరిపాలనా సంబంధి అంశాల పై కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎస్.చంద్రశేఖర్,అన్ని విభాగాల యూనిట్ అధికారులు,పర్యవేక్షకులు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం,వసతి సదుపాయం,రెవెన్యూ తదితర విభాగాలకు సంబంధించిన అంశాలతో పాటు పలు పరిపాలనా అంశాలను కూడా కార్యనిర్వహణాధికారివారు సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ అన్ని విభాగాలు కూడా ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న భక్తులరద్దీకనుగుణంగా ఆయా మౌలికసదుపాయాలు కల్పించేందుకు ఇంజనీరింగ్ విభాగం వారు శాస్త్రీయ అంశాల ఆధారంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం సమీపభవిష్యత్తులో చేపట్టవలసిన పనుల గురించి చర్చించారు. ముఖ్యంగా అన్ని నిర్మాణ పనులను కూడా సకాలంలో పూర్తి అయ్యేవిధంగా పనుల పర్యవేక్షణ ఉండాలన్నారు. అదేవిధంగా నిర్మాణాలకు నాణ్యమైన మెటీరియలును వాడాలన్నారు. అదేవిధంగా పనులలో తప్పనిసరిగా పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు.ఇంకా వారు మాట్లాడుతూ విభాగాధికారులందరు కూడా ఎప్పటికప్పుడు వారివారి విభాగాల సిబ్బందికి తగు దిశానిర్దేశం చేస్తూ సమన్వయంతో విధులను నిర్వర్తింపజేయాలన్నారు. ఉద్యోగులందరు కూడా జవాబుదారితనంతో విధులు నిర్వర్తించాలన్నారు. క్షేత్రపరిధిలోని శౌచాలయాల నిర్వహణను కూడా రోజువారిగా పర్యవేక్షిస్తుండాలన్నారు. ముఖ్యంగా అవసరమైన మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. అన్ని భవనాలలో కూడా ఎలక్ట్రికల్ వైరింగులను క్షుణ్ణంగా పరిశీలిస్తుండాలన్నారు.

## కాసరం గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ భూమి పూజ.ఎమ్మెల్యే బొజ్జల



**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తినియోజకవర్గం తొట్టంబేడుమండలంలోని కాసరం గ్రామంలో నూతనంగా నిర్మాణం కానున్న 33/11 కిలో వాట్స్ విద్యుత్ సబ్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని భూమి పూజ నిర్వహించారు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ..తన తండ్రి మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కల నెరవేర్చేవిధంగా నాలుగుకోట్ల రూపాయలు వ్యవంతో ఈ ప్రాంతం నందు 33/11 కిలో వాట్స్ విద్యుత్ సబ్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమానినిర్వహించామని,మరో మూడునెలలో ఈప్రాంతశీ నందు 33/11 కిలో వాట్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పూర్తిఅవుతుందని, ఈప్రాంతం నందు 33/11 కిలో వాట్స్ విద్యుత్ సబ్ స్టేషన్ రావడంలో ఈ పంచాయతీ నందు అన్ని గ్రామంలోని ప్రజలకు విద్యుత్ కోరారు ఉండదని, రైతులకు ఈ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు అవ్వడంతో పంటపొలాల సాగుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలియజేశారు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని తెలియజేశారు.

## శ్రీశైలం దేవస్థానంలో చివరి శ్రావణ శుక్రవారం

**- శ్రావణ వరలక్ష్మి వ్రతంలో ఆలయ ఈవో ఎం శ్రీనివాసరావు దంపతులు**




శ్రీశైలం ( ప్రశ్న న్యూస్)శ్రీశైలం మల్లన్న క్షేత్రంలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు ఆలయ ఉత్తర భాగంలోని చంద్రావతి కల్యాణ మండపంలో జరిగిన వరలక్ష్మి వ్రతంలో నంద్యాల,పల్నాడు,మార్కాపురం జిల్లాలకు సంబంధించిన సుమారు 1233 మంది చెంచు గిరిజన మహిళల ముత్తైదువులు అలానే 500 మంది సాధారణ మహిళలు మొత్తం 17 వందల మంది మహిళ ముత్తయిదువులు పాల్గొన్నారు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలకు దేవస్థానమే ఉచితంగా వరలక్ష్మి వ్రత పూజా సామగ్రిని అందజేసి వ్రతాన్ని శాస్త్రోక్తంగా వ్రత సంకల్పాన్ని పఠించి నిర్వీఘ్నంగా జరిపించారు అనంతరం వ్రతంలో పాల్గొన్న చెంచు గిరిజన మహిళలకు సాధారణ మహిళలకు అమ్మవారి శేషవస్త్రంగా చీర,రవిక పూలు,గాజులు, ప్రసాదం అందజేసి శ్రీ స్వామి,అమ్మవార్ల దర్శనం కల్పించారు వ్రతంలో పాల్గొన్న మహిళలందరికి దేవస్థానం అన్నపూర్ణ భవనంలో భోజన ఏర్పాట్లు కూడా చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు ప్రకటనలో తెలుపగ వ్రతంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు దంపతులు,దేవస్థానం మహిళ అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల అరెస్ట్ రిమాండ్ కు తరలింపు




ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు రోడ్డు మీద ధర్నా చేసి వాహనాదారులకు అడ్డుకొని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పిండ ప్రధానం చేసి, ఇరు వర్గాల మనోభావాలను రెచ్చగొట్టే విధంగా ప్రజాశాంతికి భంగం కలిగించడమే కాకుండా పోలీస్ విధులను అడ్డుకున్న పలువురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై పలు సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అందులో భాగంగా ఇల్లందుల శ్రీనివాస్ రెడ్డి, పందిర్ల పరుశు రాములు, ఎల్లారెడ్డిపేట మండల్ బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ వరస కృష్ణ హరి, దుమాల సర్పంచ్ సోమారపు శరవింద్ అను నలుగురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించడమైనదని పోలీసులు తెలిపారు. జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలులో వున్నందున పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని యస్ ఐ ఎన్.రమేశ్ తెలిపారు.

## శ్రీశైలంలో శాస్త్రోక్తంగా గోపూజ కృష్ణాష్టమి వేడుకలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈవో ఎం శ్రీనివాసరావు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్ )కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు అర్చకులు వేదపండితులు ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులంలో గోపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ప్రతీనిత్యం ఆలయంలో ప్రాత:కాల సమయంలో నిత్యసేవగా గోపూజ నిర్వహించబడుతున్నప్పటికీ, కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు నిత్యసేవతో పాటు విశేషంగా గోపూజ జరిపించబడిందని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.శాస్త్రోక్తంగా జరిగిన ఈ గోపూజలో ముందుగా ఆలయప్రాంగణంలోని శ్రీ గోకులములో గోవులకు, గోవత్సాలకు (ఆవుదూడలకు) ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు, వేదపండితులు పూజాసంకల్పాన్ని పఠించారు. సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, అతివృష్టి,అనావృష్టి నివారించబడాలని, పాడిపంటలతో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అగ్నిప్రమాదాలు, వాహనప్రమాదాలు మొదలైనవి నిరోధించబడాలని, అందరికి శ్రేయస్సు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గోపూజను ఆచరించడం వలన లోకం సుభిక్షంగా ఉంటుందని, శాస్త్రాలు పేర్కొంటున్నాయని అర్చకస్వాములు వెల్లడించారు.

# 'రంభ ఊర్వశి మేనక'- మూవీ రివ్యూ!





హాస్యకథానాయకుడిగా అనేక చిత్రాలను చేసిన అల్లరి నరేశ్, ఈ మధ్య కాలంలో కాస్త డిఫరెంట్ కాన్సెప్ట్ లను ట్రై చేస్తూ వెళుతున్నాడు. దాంతో ఆయన నుంచి మరో కామెడీ కంటెంట్ ఎప్పుడు వస్తుందా అని అభిమానులు వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన చేసిన మరో వినోదభరిత చిత్రమే 'రంభ ఊర్వశి మేనక'. ఫాంటసీ టచ్ తో సాగే ఈ సినిమాకి చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహించాడు. ఈ రోజునే థియేటర్లలో ఈ సినిమా విడుదలైంది. మరి ఈ సినిమా ఏ స్థాయిలో ఆడియన్స్ ను నవ్వించిందనేది చూద్దాం. సూరి (అల్లరి నరేశ్) 'పెద్ద బాణాపురం' అనే విలేజ్ లో తన తల్లితో కలిసి నివసిస్తూ ఉంటాడు. తన తండ్రికి సినిమా హీరో కావాలనే కోరిక ఉంటుంది. అయితే డ్రామా ఆర్టిస్ట్ గానే ఆయన మిగిలిపోవలసి వస్తుంది. దాంతో తాను సినిమా హీరో కావాలనే పట్టుదలతో సూరి ఉంటాడు. సూరి చిన్నప్పటి నుంచి ఆ ఇంట్లో ఒక మేజిక్ బుక్ ఉంటుంది. ఆ బుక్ లోని చుక్కలను సరైన పద్ధతిలో కలిపితే, 'రంభ .. ఊర్వశి .. మేనక' దిగివస్తారు. కోరిన కోరికలను నెరవేరుస్తారు అనే విషయం తన బాబాయ్ రమణ (సీనియర్ నరేశ్) ద్వారా తెలుసుకుంటాడు. అప్పటి నుంచి సూరి ఆ మేజిక్ బుక్ పై చుక్కలను అనేక రకాలుగా కలపడానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు. రంభ .. ఊర్వశి .. మేనక దిగివస్తే, తనని సినిమా హీరోను చేయమని అడగాలనేది అతని ఉద్దేశం. ఏనాటికైనా అది జరుగుతుందనే నమ్మకంతో, ఏ పని చేయకుండా తల్లి కష్టంపై ఆధారపడి బ్రతుకుతుంటాడు. త్వరలో సినిమా స్టార్ ను అవుతాననే ఆశతో స్టేజ్ నాటకాలను కూడా పూర్తిగా పక్కన పెట్టేస్తాడు. రంభ .. ఊర్వశి .. మేనక విగ్రహాలను పూజిస్తూ వాళ్లు ప్రత్యక్షమయ్యే రోజు కోసం వెయిట్ చేస్తుంటాడు. ఎక్కడా ఏ పనీ చేయకుండా తిరుగుతూ ఉండటంతో, సూరికి అప్పులు పెరిగిపోతాయి. ఈ నేపథ్యంలోనే చిన్నీ (సురభి) సూరిని ప్రేమిస్తూ ఉంటుంది. అతను కూడా ఆమెను పెళ్లి చేసుకుందామని అనుకుంటాడు. అయితే నెల రోజుల్లో అప్పులన్నీ తీర్చేసుకుంటే తన కూతురునిచ్చి పెళ్లి చేస్తాననీ, లేదంటే పోలీస్ ఆఫీసర్ అప్పలనాయుడితో ఆమె వివాహం జరిపిస్తానని చిన్నీ తండ్రి తెగేసి చెబుతాడు. అసలే అప్పలనాయుడితో స్కూల్ డేస్ నుంచి గొడవలు ఉండటంతో సూరి ఆలోచనలో పడతాడు. సాధ్యమైనంత త్వరగా రంభ .. ఊర్వశి .. మేనకలను ప్రత్యక్షం చేసుకుని, తనని ఈ గండం నుంచి గట్టెక్కించమని కోరాలని సూరి నిర్ణయించుకుంటాడు. అదేసమయంలో అతని తల్లి 'తులసమ్మ'కి ఒక సర్జరీ అవసరమవుతుంది. అందుకు 50 లక్షలు కావలసి వస్తుంది. ఉన్న అప్పులు తీర్చాలని అనుకుంటూ ఉండగా, కొత్తగా పెద్ద మొత్తంలో అప్పుచేయవలసి వస్తుంది. అప్పుడు సూరి ఏం చేస్తాడు? ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? రంభ ఊర్వశి మేనక అతని కోరికలు నెరవేరుస్తారా? చిన్నితో అతని పెళ్లి జరుగుతుందా? తన తల్లిని అతను బ్రతికించికోగలుగుతాడా? అనేది మిగతా కథ. సాధారణంగా దేవతలను ప్రత్యక్షం చేసుకునే మార్గం ఏదైనా ఉంటే, అందరూ ఆ మార్గాన్ని అనుసరించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. తమ కోరికలను ఆ దేవతలు తప్పకుండా నెరవేర్చుతారని తెలిసినప్పుడు, తాము చేయవలసిన ఏ పనీ చేయకుండా ఆ రోజు కోసం వెయిట్ చేస్తుంటారు. ఈ కథలోని కథానాయకుడు కూడా అంతే. భారం మొత్తం అప్సరసలపై వేసి .. బద్ధకంతో రోజులు గడిపేసే ఒక సూరి కథ ఇది. చిన్నప్పటి నుంచి మేజిక్ బుక్ పైనే ఆశలు పెట్టుకుని పెరిగిన సూరి, రంభ .. ఊర్వశి .. మేనకను ప్రత్యక్షం చేసుకోవడానికి చేసే ప్రయత్నాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. బుక్ కారణంగా వాళ్లు భూలోకానికి రావడం .. తనకి చెప్పకుండా వెళ్లారనే కోపంతో దేవేంద్రుడు వాళ్లకి ఎలాంటి శక్తులు లేకుండా చేయడంతో కథ మరింత ఆసక్తికరంగా మారుతుంది. తిరిగి వెళ్లలేని అప్సరసలతో సూరి ఏం చేస్తాడు? అనే సందేహంతో కూడిన సన్నివేశాలతో సెకండాఫ్ కొనసాగుతుంది. ఉన్న అప్పులు తీర్చకపోతే ప్రేమించిన అమ్మాయి దక్కకుండా పోతుంది. కొత్తగా అప్పు చేయకపోతే కన్నతల్లి ప్రాణాలతో దక్కకుండా పోతుంది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అప్సరసలు ప్రత్యక్షమైనా, వాళ్ల శక్తులన్నీ దేవేంద్రుడు అధీనంలో ఉంటాయి. ఇలాంటి పరిస్థితులలో తానున్న సమస్యలలో నుంచి ఒక సాధారణ యువకుడు ఎలా బయటపడతాడు? అనే ఒక ఉత్కంఠను రేకెత్తించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేస్తూ వెళ్లాడు. ఒక వైపున దేవలోకంలో దేవేంద్రుడు .. మరో వైపున భూలోకంలో అప్సరసలు .. ఈ మధ్యలో అడపా దడపా వచ్చివెళ్లే యమధర్మరాజు హీరో సర్కిల్ ను టచ్ చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలకు సాధ్యమైనంత వరకూ కామెడీని అద్దడానికి ప్రయత్నిస్తూ వెళ్లారు. బాహుబలి .. పోకిరి .. అవతార్ పోస్టర్ లపై హీరోగా అల్లరి నరేశ్ ను చూపించడం, రంభను లైన్లో పెట్టడానికి సీనియర్ నరేశ్ ట్రై చేయడం వంటి సన్నివేశాలు కొంతవరకూ నవ్వించగలుగుతాయి. అప్సరసలు రాగానే కోరికలన్నీ చెప్పడానికి ఒక చిట్టా తయారు చేయడం నవ్వు తెప్పిస్తుంది. ఫస్టాఫ్ లో కాస్త పలచగా కనిపించిన కథ, ఆ తరువాత కొంత చిక్కబడినట్టుగా అనిపిస్తుంది. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ లో ఆడియన్స్ కాస్త ఫోకస్ పెట్టేలా చేస్తుంది. అల్లరి నరేశ్ కి ఇలాంటి పాత్రలు చేయడం చాలా తేలిక. ఇక సీనియర్ నరేశ్ .. శ్రీనివాసరెడ్డి .. వెన్నెల కిశోర్ కొంతవరకూ నవ్వించగలిగారు. అలాగే హీరో వైపు నుంచి మదర్ సెంటిమెంట్ ను కొంతవరకూ కనెక్ట్ చేయగలిగారు. రామ్ రెడ్డి ఫొటోగ్రఫీ బాగుంది. చైతన్ భరద్వాజ్ సంగీతం ఫరవాలేదు. రంభ ఊర్వశి మేనకలతో కూడిన స్పెషల్ సాంగ్ తో పాటు మిగతా బాణీలు ఫరవాలేదు. ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ ఓకే. హీరో అతని ఫ్రెండ్స్ చిన్నీ దగ్గరికి వెళ్లి తన్నులు తినే సీన్ వంటివి ట్రిమ్ చేస్తే బాగుండేదని అనిపిస్తుంది. గ్రాఫిక్స్ కి సంబంధించిన వర్క్ బాగుంది. ఈ సినిమా టైటిల్ 'రంభ.. ఊర్వశి .. మేనక'. వాళ్లే ఈ సినిమాలో ప్రధానమైన పాత్రలు. అలాంటి పాత్రలకు ఆర్టిస్టుల ఎంపిక కరెక్టుగా లేదని అనిపిస్తుంది. ఇక వాళ్ల విగ్రహాలను మలచిన విషయంలోనూ ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టలేదని తెలిసిపోతూనే ఉంటుంది. 'మేజిక్ బుక్'ను డిజైన్ చేసిన తీరు కూడా అంతే. అంత పెద్ద బుక్ ను చాలా తేలికగా పట్టుకుంటూ, అది పేజీలు లేని డమ్మీ బుక్ అనే విషయాన్ని చెప్పకనే చెబుతుంటారు. 'ఈ బూత్ బంగళాను బాగు చేయాలంటే ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి రావాలి', 'హతవిధీ కాదు సార్ .. ఇది గాంధీనగర్ రెండో వీధి', 'బలమైన సాక్ష్యులుగా కాదు .. బలవంతపు సాక్ష్యులుగా కనిపిస్తున్నారు'

.. 'వీడు అనకొండ పాము కాదు .. మణికొండ పాము'.. 'వీడు ప్రతినాయకుడు కాదు .. అతి నాయకుడు' అనే డైలాగ్స్ నవ్వుకునేలా చేస్తాయి. కాస్త అటు ఇటుగా ఈ తరహా కథలు గతంలో వచ్చినవే. అందువలన రొటీన్ కి భిన్నంగా మనకి ఏమీ అనిపించదు. అక్కడక్కడా కాస్త నవ్వించినా, మొత్తంగా చూసుకుంటే మాత్రం ఇది ఓ మాదిరి సినిమాగానే అనిపిస్తుంది. కష్టపడితేనే కష్టాలను దాటుకుని ముందుకు వెళ్లగలం. ప్రయోజకుడైన ప్రతి కొడుకు తన తల్లి దృష్టిలో హీరోనే అనే సందేశం మాత్రం ఆలోచింపజేస్తుంది.

# 'కొరియన్ కనకరాజు' ఓటీటీ ఎంట్రీ..

## వరుణ్ తేజ్ హిట్ మూవీ ఇప్పుడు ఎందులో స్ట్రీమింగ్ అంటే..!



ఈ ఏడాది టాలీవుడ్‌లో పలువురు హీరోలు సాలిడ్ కంబ్యాక్ ఇచ్చారు. ఆ లిస్ట్‌లో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కూడా ఉన్నారు. కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్‌కు 'కొరియన్ కనకరాజు' మంచి విజయాన్ని అందించింది. హారర్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి ఫలితాన్ని అందుకుంది. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించారు . విభిన్నమైన కథ, కామెడీ, హారర్ అంశాలను కలగలిపి తెరకెక్కించిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. థియేటర్లలో కూడా అదే జోరును కొనసాగిస్తూ మంచి విజయాన్ని అందుకుంది. థియేట్రికల్ రన్‌ను పూర్తి చేసుకున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల ఆడియన్స్‌ను కూడా టార్గెట్ చేస్తూ మొత్తం ఐదు భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. దీంతో థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి నుంచే చూసే అవకాశం దక్కింది. వరుణ్ తేజ్ గత కొంతకాలంగా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ వస్తున్నారు. అయితే ఆశించిన స్థాయిలో వరుస విజయాలు మాత్రం దక్కలేదు. ఈ నేపథ్యంలో 'కొరియన్ కనకరాజు'తో వచ్చిన సక్సెస్ ఆయన అభిమానులకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది. హారర్, కామెడీ, డ్రామా అంశాలను కలిపి తెరకెక్కించిన ఈ సినిమాలో వరుణ్ తేజ్ కొత్త తరహా పాత్రలో కనిపించడం కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రితికా నాయక్ తన పాత్రకు న్యాయం చేయగా.. మేర్లపాక గాంధీ తన మార్క్ కామెడీ, కథనంతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే ప్రయత్నం చేశారు. సినిమాను థియేటర్లలో చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో పాటు.. ఓటీటీకి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారికీ ఇప్పుడు గుడ్ న్యూస్ వచ్చేసింది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో 'కొరియన్ కనకరాజు' ఐదు భాషల్లో అందుబాటులో ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే కాకుండా ఇతర ప్రాంతాల ప్రేక్షకులు కూడా ఈ సినిమాను చూసే అవకాశం ఉంది.


# సూర్యకు జోడీగా?



నటిగా వామికా గబ్బీది 19ఏండ్ల ప్రయాణం. హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, పంజాబీ భాషల్లో కలిపి దాదాపుగా ఓ ముప్పై సినిమాల్లో నటించింది. కానీ గుర్తింపు మాత్రం అరాకొరే. అయితే.. 'డీసీ' సినిమా ఆమె తలరాతను మార్చింది. రాత్రికి రాత్రి తనను స్టార్‌ని చేసింది. ఆ సినిమాలో వామిక పోషించిన 'చంద్ర' పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో బలమైన ముద్రనే వేసిందని చెప్పాలి. దీంతో ఈ చండీఘడ్ సుందరికి అవకాశాలు వరుస కడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అగ్ర కథానాయకుడు సూర్యకు జోడీగా ఈ ముద్దుగుమ్మ నటించనున్నట్టు వినికిడి. సూర్య ప్రస్తుతం జితు మాధవన్ దర్శకత్వంలో 47వ సినిమా చేస్తున్నారు. 'జైభీమ్' దర్శకుడు జ్ఞానవేల్ దర్శకత్వంలో 48వ సినిమా ఉంటుంది. తర్వాత హెచ్.వినోద్ డైరెక్షన్‌లో 49వ సినిమా చేస్తారు సూర్య. ఆ సినిమాలోనే వామిక గబ్బీ కథానాయికగా ఖరారైనట్టు తెలిసింది. ఈ వార్త నిజమైతే.. వామికా రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే.

# కష్టాల్లో ఉన్నప్పుడు బాలీవుడ్ పట్టించుకోలేదు..

## 'హనుమాన్ అంశ్' సక్సెస్‌పై దర్శకుడు కామెంట్స్!




ఉత్తరాదిలో ఫేమస్ అయిన నీమ్ కరోలి బాబా జీవితాధారంగా తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయంతో అందరినీ షాక్‌కి గురిచేస్తోంది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా, అతి తక్కువ థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, మౌత్ టాక్ బలతో అనూహ్యమైన వసూళ్లను సాధిస్తోంది. ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి తొలి రోజు కేవలం పది లక్షల రూపాయల కలెక్షన్లు మాత్రమే వచ్చాయి. బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల పోటీ కారణంగా పలు ప్రాంతాలలో దీని షోలను 250 నుంచి కేవలం 25కి కుదించారు. మల్టీప్లెక్స్ థియేటర్ల నిర్వాహకులు సైతం ఈ సినిమా ప్రదర్శన పట్ల నిరుత్సాహం కనబరిచారు. అయితే, చిత్రంలోని ఆధ్యాత్మిక లోతు, భావోద్వేగాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోవడంతో మౌత్ టాక్ పుంజుకుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ సినిమా హౌస్‌ఫుల్ బోర్డులతో దూసుకుపోతూ ఇప్పటివరకు రూ. 72.88 కోట్ల వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అయితే ఈ అఖండ విజయంతో చిత్ర యూనిట్ ఆనందంలో మునిగిపోగా, దర్శకుడు విశాల్ చతుర్వేది బాలీవుడ్ ధోరణిపై తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఈ సినిమా కష్టకాలంలో ఉన్నప్పుడు ఎవరూ అండగా నిలవలేదని, సహాయం కోరితే ముఖం చాటేశారని విశాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆధ్యాత్మిక చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిలబడవంటూ కొందరు ఉచిత సలహాలు ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. కానీ చిత్రం విజయం సాధించిన తర్వాతే ప్రముఖుల నుంచి ఫోన్‌లు, అభినందనలు వస్తున్నాయని తెలిపారు. సినిమా తొలి రోజుల్లోనే స్పందించి అభినందించిన దర్శకుడు మధుర్ భండార్కర్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే, ఎంపీ మరియు నటి కంగనా రనౌత్ ఈ చిత్రాన్ని వీక్షించి, ఇందులోని ఆధ్యాత్మిక భావనలు ఎంతో ప్రశాంతతను ఇస్తాయని ప్రశంసించినట్లు ఆయన వెల్లడించారు. ప్రేక్షకుల నుంచి వస్తున్న ఈ అపూర్వ స్పందనను దృష్టిలో ఉంచుకుని, ఈ చిత్రానికి సీక్వెల్ నిర్మించనున్నట్లు చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.


# 100శాతం వినోదం గ్యారెంటీ



'ఇది అందరిని నవ్వించే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. నేను చిన్నప్పటి నుంచి నాగార్జునగారి అభిమానిని. ఆయనతో కలిసి 'నా సామిరంగా' చిత్రంలో నటించాను. ఇప్పుడు ఆయన ప్రొడక్షన్‌లో హీరోగా చేయడం ఆనందంగా ఉంది' అన్నారు అల్లరి నరేష్. ఆయన కథానాయకుడిగా చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. థియేటర్ నుంచి ప్రేక్షకులు నవ్వుకుంటూ బయటికొస్తారని, వందశాతం వినోదాన్ని పంచే సినిమా ఇదని చిత్ర నిర్మాతలు రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ తెలిపారు. తన తొలి చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌లో చేయడం ఆనందంగా ఉందని దర్శకుడు చంద్రమోహన్ చింతాడ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయికలు ప్రిషా సింగ్, రాశిసింగ్, విష్ణుప్రియతో పాటు యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# ప్రారంభానికి

## ముహూర్తం ఖరారు?



'పెద్ది'తో 400కోట్ల విజయాన్ని అందుకున్న రామ్‌చరణ్ తన నెక్ట్స్ సినిమా కోసం రెడీ అవుతున్నారు. పాన్ ఇండియా డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో ఆయన నటించనున్న విషయం తెలిసిందే. 'పుష్ప' ఫ్రాంచైజీ తర్వాత సుకుమార్ నుంచి రానున్న సినిమా కావడం, 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడం.. ఈ రెండు కారణాల వల్ల ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాకు చెందిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని దసరా రోజున ఘనంగా నిర్వహించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. అర్బన్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే వైవిధ్యమైన కథతో రూపొందనున్న ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లకు స్థానం ఉన్నది. ప్రస్తుతమైతే రష్మిక మందన్న, జాన్వీకపూర్, అషికా రంగనాథ్‌ల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.

## మల్లన్న సాగర్ బాధితులకు న్యాయం చేయాలి

- ఇంటింటికీ వెళ్లి బాధితుల సమస్యలు తెలుసుకున్న టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి



గజ్వేల్,( ప్రశ్న న్యూస్ ) మల్లన్న సాగర్ ముంపు గ్రామాల బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ జన సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లోని ఆర్అండ్ఆర్ కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ముంపు గ్రామాల బాధితులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కీసర స్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నీరుడి స్వామి మాట్లాడుతూ వేములఘాట్, పల్లెపాడు, కిష్టాపూర్, ఎర్రవల్లి తదితర మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ముంపు గ్రామాల ప్రజలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బాధితుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని కోరారు.ముంపు గ్రామాల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన అనేక మంది ప్రస్తుతం జీవనోపాధి కోసం రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారని, పని దొరకని రోజుల్లో కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టంగా మారిందని బాధితులు తమతో ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. వారి జీవనోపాధి కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని, అవసరమైన చోట పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.మల్లన్న సాగర్ బాధితులపై గత ప్రభుత్వం నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ఇప్పటికీ కొంతమంది రైతులకు పరిహారం, ఇతర ప్రయోజనాలు అందలేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించి అర్హులైన ప్రతి బాధితుడికి న్యాయం చేయాలని నీరుడి స్వామి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో లక్ష్మాపురం కనకయ్య, నాన్నం గిరి, ముంపు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ను నిరసిస్తూ వంట-వార్పు




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** 1000 రోజుల కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ బిఆర్ఎస్ నేతలు మేడ్చల్ లో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. రోడ్డుపై వంట వార్పు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా చామకూర మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. నిరుద్యోగ మహిళలకు ఇస్తామన్నా రూ. 2500 ఏమయ్యాయి అని, తులం బంగారం ఏమైందని, మహిళలకు ఇస్తామన్న స్కూటీ ఏమైందని ప్రశ్నించారు. అమలు కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంకు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. మేడ్చల్ సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన 4 20 హామీలను పరిష్కరించకపోతే సీఎం రేవంత్ రెడ్డి 420 గా మిగిలే అవకాశం ఉందని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే పరిష్కరించాలని భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నేతలు నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లంపేట లో....

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఎల్లంపేట ప్రధాన రహదారిపై కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై నిరసన తెలిపారు. రోడ్డుపై వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాబిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను పరిష్కరించే వరకుపోరాటాలు ఆగవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి సీనియర్ నాయకులు రాజ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌ను కించపరిస్తే సహించేది లేదు

- రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా 'అంబేడ్కర్ కల్పిత నాయకుడు' పేరుతో పుస్తకం రాస్తూ, సామాజిక మాధ్యమాల ద్వారా ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్‌పై ప్రభుత్వం, పోలీసులు సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు డిమాండ్ చేశారు.శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో 'అంబేడ్కర్ కల్పిత నాయకుడు' పుస్తకంపై నిరసన వ్యక్తం చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట రాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కల్పించడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన అంబేడ్కర్‌కు దేశ, విదేశాల్లో విశిష్ట గుర్తింపు ఉందని పేర్కొన్నారు.అంబేడ్కర్ ఆలోచనలు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషిపై ప్రపంచవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు, సంస్థలు అధ్యయనం చేస్తున్నాయని తెలిపారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని విజ్ఞాన దివస్‌గా నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని పేర్కొన్నారు.అంబేడ్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగ విలువలను, సామాజిక న్యాయ స్ఫూర్తిని అవమానించడమేనని పుట్ట రాజు అన్నారు. అంబేడ్కర్ ఆశయాలైన సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, సామాజిక న్యాయాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నాయకులు సొక్కం స్వామి, శ్రీనివాస్, భాస్కర్, నాగరాజు, నవీన్, భానుప్రసాద్, దేవరాజ్, చాణక్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరం నేర్పి...జీవితాన్ని తీర్చిదిద్దే శిల్పి గురువు




**( ప్రశ్న న్యూస్-- మేడ్చల్ ప్రతినిధి చిన్న)**

"గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్ దేవో మహేశ్వరః గురుః సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః" అనే శ్లోకం గురువు గొప్పతనాన్ని చాటిచెబుతుంది. తల్లిదండ్రుల తర్వాత పిల్లల జీవితాన్ని తీర్చిదిద్దే గొప్ప బాధ్యతను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తారు. విద్యార్థికి పాఠ్యపుస్తకంలోని విషయాలను మాత్రమే కాకుండా, జీవితంలో ఎలా ముందుకు సాగాలి, మంచిని ఎలా ఎంచుకోవాలి, క్రమశిక్షణతో ఎలా జీవించాలి అనే విషయాలను కూడా గురువులు నేర్పిస్తారు. గురువు అంటే కేవలం పాటలు చెప్పేవారు కాదు గురువు విద్యార్థి జీవితానికి ఒక దిశనిర్దేశకుడు అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని అందిస్తారు విద్యార్థికి సరైన మార్గాన్ని చూపిస్తారు ప్రశ్నించే తత్వాన్ని ఆలోచించే శక్తిని పెంచుతారు క్రమశిక్షణ, బాధ్యత, మానవతా విలువలను నేర్పిస్తారు విద్యార్థిలో దాగి వున్నా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారు మంచి పౌరులుగా ఎదగడానికి పునాది వేస్తారు

### సెప్టెంబర్ 5నే టీచర్ డే ఎందుకు?

భారతదేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారు. ఈ రోజు భారతదేశ రెండో రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి.ఆయన గొప్ప ఉపాధ్యాయుడిగా, విద్యావేత్తగా దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ప్రారంభమైంది.

### డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనం

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన ఉపాధ్యాయ వృత్తిని ఎంతో గౌరవించేవారు. ఆయన జన్మదినాన్ని తన పేరుతో కాకుండా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని కోరిన నేపథ్యంలో, సెప్టెంబర్ 5 టీచర్ డేగా ప్రత్యేక గుర్తింపు పొందింది.

### గురువు ఋణం తీర్చుకోలేనిది

ఒక విద్యార్థి జీవితంలో సాధించిన విజయాల వెనుక తల్లిదండ్రుల ప్రేమతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కూడా ఉంటుంది. ఒక మంచి గురువు చెప్పిన ఒక్క మాట, ఇచ్చిన ఒక్క సలహా, చూపిన ఒక్క మార్గం విద్యార్థి జీవితాన్నే మార్చగలదు.అందుకే గురువును కేవలం ఒక ఉద్యోగిగా కాకుండా మన భవిష్యత్తును నిర్మించే శిల్పిగా గౌరవించాలి.



### టీచర్ డే అసలు సందేశం

టీచర్ డే అంటే కేవలం పాఠశాలలో వేడుకలు నిర్వహించడం, గురువులకు పూలు ఇవ్వడం మాత్రమే కాదు. మన జీవితాన్ని తీర్చిదిద్దిన ప్రతి గురువును గుర్తు చేసుకుని, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడం ఈ రోజు యొక్క అసలు ఉద్దేశం.గురువు చూపిన బాటలో నడిచిన విద్యార్థి విజయం సాధిస్తాడు...గురువు విలువను గుర్తించిన సమాజం అభివృద్ధి చెందుతుంది."

ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి హృదయపూర్వక వందనాలు.

# కష్టం ఆయన ఆయుధం... పార్టీ ఆయన శ్వాస

- మేడ్చల్ కాంగ్రెస్‌లో తనదైన ముద్ర వేస్తున్న రామన్నగారి రాఘవేందర్ గౌడ్

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** కార్యకర్తల కోసం ముందుండే నాయకుడు.. పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమించే నిబద్ధత గల నేత రాజకీయాల్లో నాయకుడిగా ఎదగడం ఒక విషయం... పార్టీ కోసం కష్టపడుతూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ, ప్రజల మధ్య నిరంతరం ఉండటం మరో విషయం. రెండో మార్గాన్ని ఎంచుకున్న నాయకుడిగా మేడ్చల్ కాంగ్రెస్ పార్టీలో రామన్నగారి రాఘవేందర్ గౌడ్ తనదైన గుర్తింపును సంపాదించుకుంటున్నారు.పదవులు, హోదాల కోసం కాకుండా పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆయన, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా తనవంతు బాధ్యతగా భావించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

### కార్యకర్తలే బలం... వారికి అండగా రాఘవేందర్

ఏ రాజకీయ పార్టీకి అయినా కార్యకర్తలే వెన్నెముక. ఆ విషయాన్ని బలంగా నమ్మే రాఘవేందర్ గౌడ్ కార్యకర్తలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ, అవసరమైన సమయంలో వారికి అండగా నిలిచేందుకు ముందుంటున్నారు."కష్టకాలంలో పార్టీతో ఉండేవాడే నిజమైన కార్యకర్త.. కార్యకర్త కష్టాల్లో తోడుగా నిలిచేవాడే నిజమైన నాయకుడు" అనే ఆలోచనతో ఆయన ముందుకు సాగుతున్నారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

### ప్రజల మధ్యే రాజకీయ ప్రయాణం

రాజకీయ నాయకుడిగా ప్రజల మధ్య ఉండటానికే రాఘవేందర్ గౌడ్ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారం కోసం సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు.ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను వింటూ ముందుకు సాగుతున్న ఆయన "ప్రజలతో అనుబంధమే రాజకీయ నాయకుడికి అసలైన బలం" అనే విధానాన్ని ఆచరణలో చూపిస్తున్నారని అనుచరులు చెబుతున్నారు.

### పార్టీ కార్యక్రమాల్లో ముందంజ

కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలు, సమావేశాలు, ప్రజా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ శ్రేణులను సమన్వయం చేసేందుకు కృషి చేస్తున్నారు. యువతను, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు.

### రేపటి నాయకత్వానికి నేటి శ్రమే పునాది

రాజకీయాల్లో ఒక్కరోజులో గుర్తింపు రాదు. ఏళ్ల తరబడి ప్రజల మధ్య ఉండాలి... కార్యకర్తలతో కలిసి నడవాలి... పార్టీ కోసం కష్టపడాలి. ఈ విషయాన్ని నమ్ముతూ రాఘవేందర్ గౌడ్ తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.తనకు ఎదురయ్యే ప్రతి అవకాశాన్ని పార్టీ కోసం ఉపయోగించుకుంటూ, తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు."పదవి వచ్చినప్పుడు కాదు... పదవి లేనప్పుడు చేసిన సేవే నాయకుడి విలువను చెబుతుంది"మేడ్చల్ కాంగ్రెస్‌లో రాఘవేందర్ గౌడ్ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతోంది. పార్టీ కోసం కష్టపడటంలో వెనుకడుగు వేయని తత్వం, కార్యకర్తలకు అందుబాటులో ఉండే స్వభావం, ప్రజల సమస్యలపై స్పందించే మనస్తత్వం ఆయనకు ప్రత్యేక గుర్తింపును



తీసుకువస్తున్నాయి.ముందు రోజుల్లో పార్టీకి మరింత బలమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయన సాగిస్తున్న రాజకీయ ప్రయాణం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.కష్టం ఆయన బలం... కార్యకర్తలు ఆయన కుటుంబం... ప్రజాసేవ ఆయన లక్ష్యం... కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ఆయన ధ్యేయం!మేడ్చల్ రాజకీయాల్లో రామన్నగారి రాఘవేందర్ గౌడ్ పేరు మరింత బలంగా వినిపించేందుకు ఆయన చేస్తున్న నిరంతర కృషి పునాదిగా మారుతోంది

## కార్ల ఫల్టీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఎన్ హెచ్ 44 రోడ్డు

- ప్రమాదకరంగా అత్వెల్లి, రేకుల బాయి రహదారి
- ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్లు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** కార్ల ఫల్టీలకు కేరాఫ్ అడ్రస్ గా జాతీయ రహదారి 44 నిలయంగా మారింది.ప్రమాదకరంగా అత్వెల్లి, రేకుల బాయి రహదారి ప్రమాదకరంగా తయారైంది. మేడ్చెల్ లో ప్రమాదాలు ఎక్కువ ఎక్కడ జరుగుతాయంటే టక్కున జవాబు వచ్చేది ఈ ప్రాంతాల పేర్లే. ఇక్కడ రోడ్లు సమాంతరంగా లేకపోవడం, వాహనాలు వేగంగా వెళ్లడం వలన ప్రమాదాలు జోరుగా జరుగుతున్నాయి. ఇటీవల ఓ కారు రేకుల భాయి వద్ద డివైడర్ ను ఢీ కొట్టి పల్టీలు కొట్టిన ఘటనను మరువకముందే మళ్లీ శుక్రవారం స్పీడ్ గా వెళుతూ అదుపుతప్పి ఫల్టీలు కొట్టి ఓ కారు ప్రమాదానికి గురైంది. సకాలంలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. ఇందులో ప్రయాణిస్తున్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.ఇటీవల జరిగిన రెండు ప్రమాదాలను చూస్తే భయానక వాతావరణం కనిపిస్తుంది. రెండు ప్రమాదాల లో కార్లుగాలిలో సల్టీలు కొట్టడం బట్టి చూస్తే అసలు ఇక్కడ ఏం జరుగుతుంది అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అత్వెల్లి, రేకుల బాయి వద్ద రోడ్డు బాగా లేకపోవడం లేక మితిమీరి వేగంతో వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయా అని ప్రయాణికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు. వాహనాలను అతివేగంగా నడపడమే ప్రమాదాలకు మూల కారణమని ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలను నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరిగావని ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## కేసీఆర్‌పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు

- గజ్వేల్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం: వంటేరు ప్రతాప్‌రెడ్డి
- కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ రూపురేఖలను మార్చిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసిన ఘటనకు నిరసనగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికే బ్రాండ్, రోల్ మోడల్ అని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయనతో రాజీనామా చేయించాలని సవాల్ చేశారు.గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన ప్రతాప్‌రెడ్డి.. ఆయన గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గజ్వేల్‌కు ఏం చేశారో ముందుగా ప్రజలకు చెప్పాలని అన్నారు. నర్సారెడ్డి గతంలో బీఆర్ఎస్‌లో చేరి, కేసీఆర్ పాలనను సమర్థించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన వాహనంలో తిరుగుతూ తనకు ఓట్లు వేయాలని ప్రచారం చేసిన వ్యక్తి ఇప్పుడు కేసీఆర్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.

ముంపు గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముంపు గ్రామాల ప్రజల సమస్యలపై కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వారిని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

### గజ్వేల్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

కేసీఆర్ హయాంలో గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధిపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులను తీసుకురావాలని, కాంగ్రెస్ నాయకులు కూడా చర్చకు రావాలని సవాల్ చేశారు. గజ్వేల్ అభివృద్ధిపై వాస్తవాలు ప్రజల ముందు ఉంచేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు.రోడ్డుపై నిలబడి విమర్శలు చేయడం కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆయన ఇచ్చిన హామీలను అమలు చేయించాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. గజ్వేల్ ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నామని వంటేరు ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు.

# గుంతలమయంగా గ్రేటర్ హైదరాబాద్ రోడ్లు

- రోడ్లపై గుంతలు.. జీహెచ్ఎంసీకి కనిపించవా.?
- ప్రజల ప్రాణాలతో చెలగాటం.. అధికారుల నిర్లక్ష్యం
- పూడ్చాల్సిన గుంతలే పెరుగుతున్నాయ్
- కోట్ల ఖర్చు.. రోడ్ల పరిస్థితి మాత్రం అధ్వానం
- డిప్యూటీ, జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ ఎక్కడ.?
- కిందిస్థాయి అధికారులదే ఇష్టారాజ్యం
- స్థానిక ప్రజాప్రతినిధులు ఎక్కడ.?




హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ఒకవైపు విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నామని పాలకులు ప్రకటిస్తుంటే, మరోవైపు నగరంలోని అనేక ప్రధాన, అంతర్గత రహదారులు గుంతలమయంగా మారి వాహనదారులకు నరకాన్ని తలపిస్తున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలు రోజురోజుకు విస్తరిస్తున్నా వాటిని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నగరంలో ఎక్కడ చూసినా రోడ్డు మధ్యలో, రోడ్డు పక్కన, డ్రైనేజీ పనులు జరిగిన ప్రాంతాల్లో గుంతలు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి గుంతలు కూడా సకాలంలో పూడ్చకపోవడంతో అవే భారీ గోతులుగా మారుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది.

### ఉన్నత అధికారుల పర్యవేక్షణ గాలికేనా.?

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు తమ పరిధిలోని రహదారుల పరిస్థితిపై దృష్టి పెట్టడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు ఫిర్యాదులు చేసిన తర్వాత కూడా సమస్య పరిష్కారానికి వారాలు, నెలలు, సంవత్సరాలు పడుతున్న పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ, బాధ్యత ఎవరిదో, జవాబుదారీతనం ఎక్కడిదో అర్థంకాని పరిస్థితి నెలకొందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు క్రమం తప్పకుండా రోడ్లను పరిశీలించి గుంతలను గుర్తిస్తేనే సమస్య తీవ్రత తగ్గే అవకాశం ఉందని ప్రజలు సూచిస్తున్న అ ది , కా ం ే ం ల ం పట్టించుకోకపోవడం విస్మయాన్ని గురిచేస్తుంది.



### ఖర్చు అవుతున్న నిధులు.. మారని రోడ్ల పరిస్థితి

రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత కోసం ప్రభుత్వం, జీహెచ్ఎంసీ నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మాత్రం ఏ మాత్రం మారడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుంత పూడ్చిన కొద్దిరోజులకే మళ్లీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడం ఎందుకు జరుగుతోందని నిలదీస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా.? పనులు పూర్తయిన తర్వాత అధికారులు నాణ్యతను పరిశీలిస్తున్నారా.? కాంట్రాక్టర్ల పనితీరుపై పర్యవేక్షణ ఉందా.? క్వాలిటీ కంట్రోల్ పరిస్థితి ఏమిటి.? గుంతలు పూడ్చడం కాగితాలకే పరిమితమైనదా.? అనే ప్రశ్నలకు సమాధానాలు అధికారులకు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. నిధులు ఖర్చు చేయడమే కాకుండా వాటి ఫలితం ప్రజలకు కనిపించేలా చేయాల్సిన బాధ్యత అధికారులపై పాలకులపై ఉందని ప్రజలు పేరుకొంటున్నారు.

### ప్రమాదాలకు గుంతలే కారణమా.?

హైదరాబాదులో విపరీతంగా ఉన్న ట్రాఫిక్ తోరోడ్డుపై ఒక్క గుంత కూడా నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో గుంతలు వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పడం, ఆకస్మికంగా బ్రేకులు వేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి.ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు నగరవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గుంతలను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించాలి

హైదరాబాద్ నగరానికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం చాలా ఉందని ప్రజలు కోరుతున్నారు. తమ నియోజకవర్గాల్లో రోడ్ల పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యేలు స్వయంగా పరిశీలించి అధికారులతో సమన్వయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజలు పన్నులు చెల్లిస్తున్న కనీసం సురక్షితమైన రహదారులు అందించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. గుంతలతో ని ండిన రోడ్లపై ప్రయాణించే ప్రజల కోసం కేటాయిస్తున్న నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయి.? రోడ్ల పరిస్థితి మాత్రం ఎందుకు మారడం లేదు.? అన్నదానిపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితిని గుర్తించాలి. గుంతల పూడ్చివేతకు తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా నాణ్యమైన, దీర్ఘకాలిక పరిష్కారం చూపాలి. లేదంటే గుంతలతో నిండిన హైదరాబాద్ రహదారులే జీహెచ్ఎంసీ పాలనకు అద్దం పడుతున్నాయన్న విమర్శలు ప్రజల నుండి తీవ్రం కావడం ఖాయం.

# రేవంత్ రెడ్డి కేబినెట్‌లోకి మరో ఫైర్‌బ్రాండ్

## - కొండా సురేఖ స్థానంలో విజయశాంతి.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కేబినెట్ విస్తరణ త్వరలో జరగనుందా? అసెంబ్లీ సమావేశాల అనంతరం కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందా?కేబినెట్‌లో మార్పులు చేర్పులకు సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల జరిగిన ఢిల్లీటూర్‌లో ఆమోదముద్రం వేయించుకున్నారా? ఈ విస్తరణలో ఎమ్మెల్సీ విజయశాంతికి బెర్త్ కన్ఫర్మా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కేబినెట్ విస్తరణ నేపథ్యంలో విజయశాంతి హుటాహుటిన ఢిల్లీకి వెళ్లడం ఆసక్తికరంగా మారింది. ఈసారి కేబినెట్ విస్తరణలో బెర్త్ కోసం అధిష్టానంతో చర్చించేందుకు వెళ్లినట్లు పొలిటికల్ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది.మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించిన నేపథ్యంలో అదే బీసీ సామాజిక వర్గం నుంచి విజయశాంతికి చోటు దక్కే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతున్న వేళ ఆమె హస్తిన టూర్ ఆసక్తికరంగా మారింది. అధిష్టానం నుంచి పిలుపు వచ్చిందా? అధిష్టానం పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే రాములమ్మ ఢిల్లీ వెళ్లారా అనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతుంది.

### - హుటాహుటిన ఢిల్లీకి విజయశాంతి

మంత్రి వర్గం నుంచి సురేఖ బర్తరఫ్‌తో తెలంగాణ రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి.కేబినెట్‌లో ఇప్పటికే రెండు బెర్త్‌ల ఖాళీగా ఉన్నాయి. తాజాగా కొండా సురేఖ బర్తరఫ్‌తో మరో ఖాళీ ఏర్పడింది.దీంతో మొత్తం మూడు మంత్రి పదవులు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే కేబినెట్ విస్తరణ, ప్రక్షాళనపై దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కొండా సురేఖ స్థానంలో సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు బీసీ, మహిళా కోటాలను ప్రాతిపదికగా తీసుకుని కొత్త ముఖాలకు అవకాశం కల్పించేందుకు ఏఐసీసీ వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. కొండా సురేఖ ఖాళీ చేసిన ఫైర్‌బ్రాండ్ స్థానాన్ని అంతే ధీటుగా భర్తీ చేయగల ఏకైక నేతగా మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ విజయశాంతి అంటూ ప్రచారం జరుగుతుంది.

### - కొండా సురేఖకు ధీటైన నేత రాములమ్మ?

రాష్ట్రంలో బలమైన బీసీ మహిళా గొంతుకగా ఉన్న కొండా సురేఖ స్థానాన్ని భర్తీ చేయాలంటే అంతే ఇమేజ్,వాగ్ధాటి ఉన్న మహిళా నేతనే ఎంపిక చేస్తే మంచిదనే అభిప్రాయంలో ఏఐసీసీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమీకరణాల నేపథ్యంలో ఒకవైపు బీసీ మహిళ మరోవైపు సినీ గ్లామర్ ఇంకోవైపు మంచి వాగ్ధాటి కావడంతో విజయశాంతి పేరు రాజకీయంగా తెరపైకి వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకు విజయశాంతిని సరిగ్గా వాడుకోలేదని...మరో మూడేళ్లలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచైనా విజయశాంతిని సరిగ్గా వాడుకోవాలనే యోచనలో ఏఐసీసీ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇలాంటి ఊహాగానాలు, కథనాలు నడుమ విజయశాంతి హస్తినకు వెళ్లడం రాజకీయంగా చర్చకు దారి తీసింది. రాములమ్మ కేబినెట్‌లో బెర్త్ కోసం ప్రయత్నించేందుకు ఆమె ఢిల్లీ వెళ్లారా అనే చర్చ జరుగుతుంది.

### - విజయశాంతికి కలిసొచ్చే అంశాలు

తెలంగాణలో ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ పార్టీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండేళ్ల వరకు ఎలాంటి పదవులు వరించలేదు. నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాల్లో ఏ ఒక్కటి కూడా విజయశాంతికి దక్కలేదు. అయినప్పటికీ విజయశాంతి ఎక్కడా అసంతృప్తి వెళ్లగక్కలేదు. గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉంటూ అధిష్టానం సూచనలకు కట్టుబడి ఉన్నారు. వివాదరహితురాలిగా ఉంటూనే పార్టీకి అవసరమైన సమయాల్లో మాత్రమే మీడియా ముందుకొచ్చి తనదైన శైలిలో గళం విప్పారు. ఈ నిబద్ధతే ఇప్పుడు ఆమెకు కలిసివచ్చే అవకాశం అని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ సంకేతాలు రాగానే ఆమె ఢిల్లీకి బయలుదేరడం వెనుక కీలక రాజకీయ ప్రణాళిక ఉన్నట్లు తెలుస్తోంది.అధిష్టానంలోని అగ్రనేతలతో ఆమెకున్న పాత పరిచయాల నేపథ్యంలో ఢిల్లీ వెళ్లినట్లు తెలుస్తోంది.

### - ప్రతికూల అంశాలు ఇవే

విజయశాంతి 2023 ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో పెద్దగా యాక్టివ్‌గా కనిపించలేదనే విమర్శ ఉంది. ఆమె 2020లో బీజేపీలో చేరి 2023 ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారు. 2025లో ఎమ్మెల్సీగా అవకాశం లభించింది. అందువల్ల పార్టీలో సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎమ్మెల్యేలు ఇలా ప్రశ్నించే అవకాశం ఉంది. 'మేము నియోజకవర్గాల్లో పార్టీ కోసం పనిచేస్తున్నాం. ఎమ్మెల్సీగా వచ్చిన వెంటనే ఆమెకు మంత్రి పదవి ఎందుకు? 'అనే ప్రశ్నలు ఎదురవుతాయని, ఇది ఆమెకు మైనస్ అయ్యే అవకాశం ఉంది. మరోవైపు బీసీ కోటాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది.అంతేకాదు ఆదీ శ్రీనివాస్ / సుదర్శన్ రెడ్డిలు రేసులో ఉండటంతో ఇది కూడా విజయశాంతికి కూడా ప్రతికూలంగా మారే అవకాశం ఉంది అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.



### - గతేడాది మార్చిలో ఎమ్మెల్సీగా ఎన్నిక

ఇక తెలుగు చిత్ర పరిశ్రమలో విజయశాంతి హీరోయిన్‌గా అలరించారు. అలాగే 'లేడీ అమితాబ్' గా గుర్తింపు తెచ్చుకున్నారు. విజయశాంతి 1998లో బీజేపీలో చేరి తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత పరిణామాలలో బీజేపీకి దూరమైన విజయశాంతి, తల్లి తెలంగాణ పార్టీని ప్రారంభించారు. అయితే తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరారు. 2009 ఎన్నికల్లో బీఆర్ఎస్ (అప్పుడు టీఆర్ఎస్) టికెట్‌పై మెదక్ లోక్‌సభ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో కేసీఆర్‌తో విబేధించి గులాబీ పార్టీని వీడి హస్తం గూటికి చేరారు. అయితే 2020లో కాంగ్రెస్ పార్టీని వీడిన విజయశాంతి, తిరిగి బీజేపీ గూటికి చేరారు. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో విజయశాంతి మళ్లీ హస్తం పార్టీలోకి వచ్చారు. అయితే విజయశాంతికి కాంగ్రెస్ పార్టీ 2025 మార్చిలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది.

# తెలంగాణలో కొత్తగా చేయూత పింఛన్లు

## - ధ్రువపత్రాలు లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చింది. దరఖాస్తు సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా వాటి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ముందుగా కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ వెల్లడించింది. దీంతో సర్టిఫికెట్లు రావడంలో జాప్యం కారణంగా దరఖాస్తు గడువు మిస్ అవుతుందేమోనని ఆందోళన చెందుతున్న వారికి ఉపశమనం లభించింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దివ్యాంగుల సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యం జరుగుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయాలు, సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్లు పొందేందుకు సమయం పడుతుండటంతో అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం ఆగకుండా ముందుగా ఆన్‌లైన్‌లో లేదా నిర్దేశిత మీసేవా కేంద్రాల్లో కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సెర్ప్ స్పష్టం చేసింది. అయితే ఇక్కడే ఓ కీలక నిబంధన ఉంది.దరఖాస్తు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా ఫర్వాలేదు. కానీ అధికారులు దరఖాస్తును పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి. కాబట్టి దరఖాస్తు చేసుకున్న తర్వాత అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. అర్హత ఉన్న వారు ఇంకా దరఖాస్తు చేయకపోతే ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోపు అప్లై చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. దీంతో అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# సురేఖను తొలగించారు సరే.. పొంగులేటి సంగతి ఏమిటి?


## - పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని హరీశ్ డిమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్ 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బంధీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

# పెట్టుబడుల వేట.. వ్యక్తిగత అంశాలు

## -విజయ్ తొలి విదేశీ పర్యటనపై తమిళనాట చర్చ



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తన తొలి అధికారిక విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్ లో పర్యటించనున్నారు. లండన్‌లో జరిగే పలు కీలక పారిశ్రామికవేత్తల సమావేశాల్లో పాల్గొని ఉన్నత స్థాయి చర్చలు జరపనున్నారు. అయితే, ఈ పర్యటన కేవలం అధికారిక కార్యకలాపాలకే కాకుండా ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించింది అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల విజయ్ భార్య సంగీత విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో వారిద్దరి మధ్య మనస్పర్థలు తొలగిపోయాయనే వార్తలు జోరుగా వినిపిస్తున్న నేపథ్యంలో, లండన్‌లో నివసిస్తున్న భార్య సంగీత, కుమార్తె దివ్యలను ఆయన ఈ పర్యటనలో కలుసుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఇదే సమయంలో నటి త్రిష కూడా ఓ షూటింగ్ నిమిత్తం యూరప్‌లోనే ఉండటంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి, రాష్ట్రంలో పెట్టుబడులు సాధించే ముఖ్యమైన లక్ష్యంతో పాటు వ్యక్తిగత జీవితపు ప్రాధాన్యతల నడుమ సీఎం విజయ్ తొలి విదేశీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588